జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జిలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967

కృష్ణ | సోమవారం 10 ఆగస్టు 2026 | సంపుటి : 01 | సంచిక :207 | పేజీలు : 12 | వెల : 3/- | PRGI No. APTEL/26/A0119,

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయణం సూర్యోదయం: 5.42 । సూర్యాస్తమయం: 6.24 చంద్రోదయం: 1.46 । చంద్రాస్తమయం: 2.20 తిథి: బహుళ దశమి ఉ. 11.13 వరకు, తదుపరి ఏకాదశి నక్షత్రం: రోహిణి మ. 3.18 వరకు, తదుపరి మృగశిర యోగం: ధృవం ఉ. 8.23 వరకు, తదుపరి వ్యాఘాతం తె. 5.20 వరకు, తదుపరి హర్షణం కరణం: భద్ర ఉ. 11.13 వరకు, తదుపరి బవ రా. 10.00 వరకు, తదుపరి బాలువ

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com



# దేశవ్యాప్తంగా విస్తృతంగా తిరంగా యాత్రలు

- 'హర్ ఘర్ తిరంగా'లో ఉత్సాహంగా పాల్గొనండి
- దేశ ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు
- హర్ ఘర్ తిరంగా క్యాంపెయిన్‌లో ప్రజలు ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చిన మోదీ
- ఆగస్ట్ 9 నుంచి 17 వరకు దేశవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు
- వందేమాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా ఈసారి మరింత ప్రత్యేకం



## నిందితులను అరెస్ట్ చేశాం..

# ప్రియాంక కుటుంబానికి న్యాయం చేస్తాం



- వైద్య విద్యార్థిని ప్రియాంక ప్రమాద ఘటనపై హోంమంత్రి అనిత ఆరా
- జిల్లా ఎస్పీతో మాట్లాడి దర్యాప్తు వివరాలు అడిగి తెలుసుకున్న మంత్రి
- బాధితురాలి తండ్రికి ఫోన్ చేసి ప్రభుత్వ అండపై భరోసా ఇచ్చారు
- నిందితులను ఇప్పటికే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని వెల్లడి

**అమరావతి**

వైద్య విద్యార్థిని ప్రియాంకను కారుతో ఢీకొట్టిన ఘటనపై రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పందించారు. ఈ కేసుకు సంబంధించి జిల్లా ఎస్పీతో ఆమె ఫోన్‌లో మాట్లాడి దర్యాప్తు పురోగతి, తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. - మిగతా3లో



## యువతకు ఐవైసి ఎప్పుడూ తోడుంటుంది

- 'ఏదో ఒకరోజు అమిత్ షా సమాధానం చెప్పక తప్పదు
- రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించకపోవటాన్ని తప్పుపట్టిన రాహుల్
- విద్యార్థుల ప్రతిధ్వని కార్యక్రమంలో ఓ విద్యార్థి ఆవేదనను పంచుకున్న కాంగ్రెస్ అగ్రనేత

## మౌలిక వసతులు, విద్య, వైద్యానికి

# పెద్దపీట



- జాతీయ జెండాతో పాటు మీ అజెండా ఉండాలి
- అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవంలో సీఎం చంద్రబాబు
- ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలని సీఎం పిలుపు

**అమరావతి**

అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం వేదికగా ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక స్ఫూర్తిదా యక ప్రసంగం చేశారు. దేశభక్తి అంటే కేవలం సరిహద్దుల్లో పోరాడటం మాత్రమే కాదని, ప్రతి పౌరుడు తన వృత్తిలో విజయం సాధించి, సమాజానికి సేవ చేయడమే నిజమైన దేశభక్తి అని ఉద్బోధించారు. ప్రతి ఒక్కరూ తమకంటూ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దేశాభివృద్ధిలో భాగస్వాము లు కావాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ దినోత్సవం సందర్భంగా విజయవాడ అంబేద్కర్ కళావేదికలో జరిగిన సభకు చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ... - మిగతా3లో

# వేగవంతమైన పరిపాలన




- మరో చారిత్రక ఘట్టానికి సిద్ధమైన అమరావతి
- సీడ్ యాక్సెస్ రోడ్డు, ప్రజాప్రతినిధుల క్వార్టర్స్‌కు తుదిమెరుగులు
- ఈ నెల 13న సీడ్ యాక్సెస్ రోడ్డును ప్రారంభించనున్న సీఎం
- బకింగ్‌హాం కెనాల్, గుంటూరు ఛానళ్లపై నిర్మించిన స్టీల్ బ్రిడ్జిలను ప్రారంభించనున్న సీఎం

**అమరావతి**

రాజధాని అమరావతి నిర్మాణంలో మరో చారిత్రక ఘట్టానికి రంగం సిద్ధమవుతోంది. సీడ్ యాక్సెస్ రోడ్డు, ప్రజాప్రతినిధుల హైరైజ్ అపార్ట్ మెంట్ టవర్లను ఈ నెల 13న సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నారు. ప్రస్తుతం వీటికి తుది మెరుగులు దిద్దుతున్నారు. అమరావతిలోని ప్రజాప్రతినిధుల నివాస సముదాయాలు, ప్రధాన రవాణా రహదారులు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్నాయి. ఈ నెల 13న ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా సీడ్ యాక్సెస్ రోడ్డుతో పాటు ప్రజాప్రతినిధుల టవర్లు ప్రారంభం కానుండటంతో సీఆర్డీఏ అధికారులు ఏర్పాట్లను వేగవంతం చేశారు. - మిగతా3లో

## స్వాతంత్ర్య పోరాటానికి 'క్విట్ ఇండియా' కొత్త శక్తినిచ్చింది

- క్విట్ ఇండియా ఉద్యమం స్వాతంత్ర్య పోరాటానికి కొత్త ఊపునిచ్చిందన్న ప్రధాని
- ఉద్యమకారుల ధైర్యసాహసాలు, త్యాగాలు తరతరాలకు స్ఫూర్తిదాయకమని వ్యాఖ్య
- 'డూ ఆర్ డై' సంకల్పాన్ని దేశప్రజల్లో నింపిందని గుర్తు చేసుకున్న అమిత్ షా
- ఉద్యమకారులకు నివాళులర్పించిన ప్రధాని, కేంద్ర హోంమంత్రి, యూపీ సీఎం



# పీఓకేలో మారుతున్న సమీకరణాలు

- పాకిస్థాన్ పాలకులపై స్థానికుల ఆగ్రహం
- ఉగ్రమూకల మనుగడ ఇక కష్టమేనా!
- పీఓకేలో ఇస్లామాబాద్ పాలకుల ఏకపక్ష విధానాలు
- స్థానిక ఆకాంక్షల అణచివేత, జమ్మూకశ్మీర్ వలసదారుల రాజకీయ ఆధిపత్యంపై దశాబ్దాలుగా గూడుకట్టుకున్న అసంతృప్తి
- ప్రస్తుతం హింసాత్మక నిరసనలు, తిరుగుబాటు



# దేశవ్యాప్తంగా విస్తృతంగా తిరంగా యాత్రలు



భారతదేశం 80వ స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలకు సిద్ధమవుతున్న వేళ దేశ ప్రజలంతా 'హర్ ఘర్ తిరంగా' ఉద్యమంలో ఉత్సాహంగా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ శనివారం పిలుపునిచ్చారు. మన త్రివర్ణ పతాకం దేశానికి గర్వకారణం మాత్రమే కాకుండా, దేశం కోసం ఎప్పటికప్పుడు అత్యుత్తమంగా పనిచేయాలనే స్ఫూర్తిని అందించే శక్తి అని మోదీ అభివర్ణించారు. ఆదివారం రోజు సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ఈ సందేశం ఇచ్చారు. హర్ ఘర్ తిరంగా క్యాంపెయిన్‌లో ఉత్సాహంగా పాల్గొని, వికసిత్ భారత్ నిర్మాణానికి తమ వంతు సహకారం అందించాలన్న సంకల్పానికి కట్టుబడి ఉండాలని ప్రజల్ని కోరారు. ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగురవేయాలని అభ్యర్థించారు. ఇంకా ఈ ఏడాది హర్ ఘర్ తిరంగా ప్రచారానికి ఒక ప్రత్యేకత ఉందని మోదీ పేర్కొన్నారు. మన జాతీయ గేయం వందేమాతరం రూపకల్పన జరిగి 150 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ వేడుకల్ని వందేమాతరానికి అంకితం ఇవ్వడం గర్వకారణమని వెల్లడించారు.

2022లో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కింద ప్రారంభమైన హర్ ఘర్ తిరంగా ప్రచారం ఇప్పుడు కోట్లాది మంది పౌరులు స్వచ్ఛందంగా పాల్గొనే జాతీయ సంప్రదాయంగా మారింది. దీని ద్వారా ప్రజలకు త్రివర్ణ పతాకంతో వ్యక్తిగత అనుబంధాన్ని పెంచడం సహా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల్ని గుర్తు చేసుకోవడం, దేశభక్తి, జాతీయ ఐక్యతను బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశాలు. ఈసారి ఆగస్టు 6న హర్ ఘర్ తిరంగా క్యాంపెయిన్‌ను లాంఛ్ చేయగా ఆగస్ట్ 9 నుంచి 17 వరకు దేశవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

**సెల్ఫీ విత్ తిరంగా, బైక్ ర్యాలీలు, ప్రత్యేక పోటీలు**

ఇక 150 ఏళ్లగా 'వందేమాతరం' దేశ ప్రజల్లో జాతీయ భావాన్ని, స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలిస్తోందని కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ ఇండిపెండెన్స్ డే సందర్భంగా అదే స్ఫూర్తి ప్రతి వీధిలో, ప్రతి ఇంటిలో ప్రతిధ్వనించేలా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపింది. ఇక్కడ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయడంతో పాటు ప్రజలు దేశభక్తి, జాతీయ ఐక్యతను చాటే వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేలా ఈసారి క్యాంపెయిన్‌ను రూపొందించారు. దేశవ్యాప్తంగా తిరంగా యాత్రలు, తిరంగా ర్యాలీలు, తిరంగా కచేరీలు, బైక్, సైకిల్ ర్యాలీలు నిర్వహించనున్నారు. కొన్ని ముఖ్యమైన ప్రాంతాల్లో త్రివర్ణ పతాక రంగులతో ప్రత్యేక అలంకరణలు, లైటింగ్ కార్యక్రమాలు, వినూత్న కాన్సర్ట్‌లు, రంగోలి పోటీలు కూడా ఏర్పాటు చేయనున్నారు. పౌరులు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి దానితో సెల్ఫీ తీసుకొని ఆ ఫొటోను ష్ఘుతీస్త్రష్ఘుతీఱతీఘఅస్త్రఘ.ఎశీఎ వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలని అధికారులు కోరారు.

**దేశవ్యాప్తంగా విస్తృతంగా తిరంగా యాత్రలు**

హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ఇప్పటికే దేశవ్యాప్తంగా జోరందుకుంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా పుదుచ్చేరిలో ఆదివారం రోజు ఈ హర్ ఘర్ తిరంగా యాత్రలో పాల్గొన్నారు. మురుగా థియేటర్ సిగ్నల్ వద్ద ఈ యాత్రను నిర్వహించగా భారీ సంఖ్యలో జనం భాగస్వాములయ్యారు. తమిళనాడులోని తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ఆయన ఈ యాత్రకు హాజరయ్యారు. ఇక త్రివర్ణ పతాకం దేశ గర్వం, ఐక్యతకు ప్రతీక అన్నారు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్. ప్రధాని మోదీ నాయకత్వంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ప్రతి ఒక్కరిలో దేశభక్తి స్ఫూర్తిని మరింత పెంచుతోందని పేర్కొన్నారు. ప్రజలు ప్రతి ఇంట్లో, ప్రతి ఒక్కరి హృదయంలో త్రివర్ణ పతాకాన్ని భాగం చేయాలని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు కోరారు. ఇక హర్ ఘర్ తిరంగా 2026ను దేశవ్యాప్తంగా దేశభక్తి పండగగా జరుపుకోవాలని మంత్రి పీయూష్ గోయల్ పిలుపునిచ్చారు.

**'డూ ఆర్ డై' పిలుపు స్వాతంత్ర్య పోరాటానికి కొత్త ఊపు**

ఇంకా అండమాన్ నికోబార్ దీవుల నుంచి మణిపుర్, ఉత్తరాఖండ్, జమ్మూకశ్మీర్, సిక్కిం వరకు పలు ప్రాంతాల్లో ఆదివారం తిరంగా యాత్రలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించారు. అండమాన్ రాజధాని శ్రీ విజయపురంలో భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ 'హర్ ఘర్ తిరంగా' ప్రచారం ప్రారంభించారు. ఆగస్టు క్రాంతి దివస్ సందర్భంగా ఫ్లాగ్ పాయింట్ వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. 1942 ఆగస్ట్ 8న మహాత్మా గాంధీ ఇచ్చిన 'డూ ఆర్ డై' పిలుపు దేశవ్యాప్తంగా స్వాతంత్ర్య పోరాటానికి కొత్త ఊపునిచ్చిందని ఉపరాష్ట్రపతి గుర్తుచేశారు. భారత్ ఎప్పుడూ శాంతిని కోరుకుంటుందని దేశ ప్రయోజనాలు, సార్వభౌమత్వాన్ని కాపాడుకునేందుకు భారత్ ఎప్పుడూ సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు.

ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి డెహ్రాడూన్‌లోని గాంధీ పార్క్‌లో నిర్వహించిన యాత్రలో పాల్గొన్నారు. అక్కడి నుంచి క్లాక్ టవర్ వరకు వేలాది మందితో కలిసి తిరంగా యాత్ర నిర్వహించారు. జమ్మూకశ్మీర్ పుల్వామా జిల్లాలో కూడా నిర్వహించిన భారీ తిరంగా ర్యాలీలో వందలాదిగా విద్యార్థులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. మణిపుర్ ఇంఫాల్‌లో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా యాత్రలో సీఎం ఖేమ్‌చంద్ సింగ్, సిక్కిం గ్యాంగ్‌టక్‌లో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు డీఆర్ థాపా తిరంగా యాత్ర నిర్వహించారు. మొత్తంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం, దేశవ్యాప్తంగా జాతీయ ఐక్యత, దేశభక్తి సందేశాన్ని విస్తృతంగా చాటుతోంది.

# పీఓకేలో మారుతున్న సమీకరణాలు



పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) అసెంబ్లీ ఎన్నికల వేళ రావల్‌కోట్ ప్రాంతం ప్రస్తుతం అశాంతి, నిరసనలతో అట్టుడుకుతోంది. ఇస్లామాబాద్ పాలకుల ఏకపక్ష నిర్ణయాలు, స్థానిక ప్రజల ఆకాంక్షల అణచివేత, జమ్మూకశ్మీర్ నుంచి వలస వచ్చిన వారి రాజకీయ ఆధిపత్యం నేపథ్యంలో దశాబ్దాలుగా స్థానికుల్లో నివురుగప్పిన నిప్పులా ఉన్న వ్యతిరేకత ఒక్కసారిగా పెల్లుబికింది. పాకిస్థాన్ ప్రభుత్వం, ఆ దేశ ఆర్మీ స్థానిక ప్రజల ఆకాంక్షలను కాలరాస్తూ, వారి రాజకీయ హక్కులను అణచివేస్తుందన్న కారణంతో పీఓకేలోని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో జులై 27 నుంచి ఆగస్టు 1 మధ్యకాలంలో ఈ ప్రాంతంలో పరిస్థితులు పూర్తిగా అదుపుతప్పాయి. స్థానిక హక్కుల పరిరక్షణను కోరుతూ ప్రజలు చేపట్టిన ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. ఆందోళనకారులు ఆగ్రహంతో భద్రతా బలగాలకు చెందిన వాహనాలను దగ్ధం చేశారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు భద్రతా బలగాలు పలుచోట్ల జరిపిన కాల్పుల్లో ఇరువైపులా ప్రాణనష్టం సంభవించడంతో ఆ ప్రాంతంలో భయానక వాతావరణం నెలకొంది.

**నిరసనలకు కారణాలు ఏంటి?**

స్థానిక ప్రజల ఆకాంక్షలను పాకిస్థాన్ ఆర్మీ, ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న అసంతృప్తి పీఓకే జనాల్లో ఉంది. దశాబ్దాల క్రితం జమ్మూకశ్మీర్ నుంచి వలస వచ్చి వచ్చి స్థిరపడిన వారు రాజకీయ ఆధిపత్యం చలాయించడం ఈ అసంతృప్తికి ఆజ్యం పోసింది. స్థానిక ఆకాంక్షలను పక్కనపెట్టి, పూర్తిగా పాకిస్థాన్ జాతీయ అజెండాకు అనుకూలంగా వలసదారులు వ్యవహరించడం స్థానికుల్లో తీవ్ర ఆగ్రహం తెప్పించింది. గిల్గిత్-బాల్టిస్థాన్ స్వయం ప్రతిపత్తిని కుదించేందుకు జరిగిన ప్రయత్నాలు, ఆ ప్రాంతాలను సాధారణ ప్రావిన్సులుగా మార్చాలన్న ఇస్లామాబాద్ పాలకుల ఆలోచనలు ఈ అగ్నికి మరింత ఆజ్యం పోశాయి. ఈ ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో పట్టు బిగించాలని చూస్తున్న ఇస్లామాబాద్ పాలకులు, దశాబ్దాలుగా ఇక్కడి ప్రజల ప్రాథమిక రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ వస్తున్నారు. ఇక్కడ సరైన ప్రజాస్వామ్య వ్యవస్థను అమలు చేయకుండా ప్రజలపై ఉక్కుపాదం మోపుతూ వచ్చింది.

**370 రద్దు తర్వాత పరిణామాలు**

2019లో ప్రధాని నేతృత్వంలోని కేంద్రం ఆర్టికల్ 370ని రద్దు చేసింది. జమ్మూకశ్మీర్‌కు ఉన్న స్వయంప్రతిపత్తి హోదాను రద్దు చేసి, కేంద్ర పాలిత ప్రాంతంగా గుర్తించింది. ఈ పరిణామం సరిహద్దు అవతిలి వైపు ఉన్న పీఓకేలో తీవ్ర రాజకీయ ప్రకంపనలు సృష్టించింది. ముఖ్యంగా గిల్గిత్-బాల్టిస్థాన్‌తో పాటు పీవోకేలోని ఇతర ప్రాంతాల్లో స్థానిక రాజకీయ పార్టీలకు ఓ రకంగా ధైర్యాన్ని నూరిపోసింది. ఈ ప్రాంతాలను పాకిస్థాన్ రాజ్యాంగ చట్రంలోకి బలవంతంగా తీసుకురావడానికి, ప్రత్యేక హోదాను తొలగించడానికి ప్రయత్నాలు కూడా మొదలయ్యాయి. 2020లో ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని పాకిస్థాన్ ప్రభుత్వం గిల్గిత్-బాల్టిస్థాన్‌కు 'తాత్కాలిక ప్రావిన్షియల్ హోదా'ను కల్పించే ప్రయత్నం చేసింది. ఈ హోదా ఇస్తే అంతా ఈ ప్రాంతానికి మంచే జరుగుతుందని నమ్మించింది. కానీ, స్థానికులు దానికి ఒప్పుకోలేదు. తమ ప్రాంతానికి శాశ్వత హోదా తేలేనంత వరకు దీనిని పాకిస్థాన్‌లో అధికారికంగా కలిపేయడం చట్టవిరుద్ధమంటూ వారు నినదించారు. తాత్కాలిక హోదా ముసుగులో పాకిస్థాన్ తమ ప్రాంతాన్ని శాశ్వతంగా ఆక్రమించుకోవాలని చూస్తోందని అప్రమత్తమయ్యారు. ఈ క్రమంలోనే పాకిస్తాన్ విధానాలకు వ్యతిరేకంగా ఒక కొత్త తరహా ప్రతిఘటనకు సిద్ధమయ్యారు.

**రాజకీయ ఆధిపత్యం వలసదారులదే**

పీఓకే అసెంబ్లీ ఎన్నికలు జులై 27, ఆగస్టు 2, ఆగస్టు 10 తేదీల్లో మూడు విడతలుగా జరిగాయి. పీఓకే లెజిస్లేటివ్ అసెంబ్లీలో మొత్తం 53 స్థానాలు ఉండగా, జమ్మూకశ్మీర్ నుంచి వలస వచ్చిన శరణార్థుల కోసం ప్రత్యేకంగా 12 స్థానాలు రిజర్వ్ చేశారు. ఇందులో జమ్మూ, కశ్మీర్ వారికి చెరో 6 స్థానాలను కేటాయించారు. పాకిస్థాన్‌లోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన ఈ శరణార్థులు పాకిస్థాన్ జాతీయ పార్టీల తరఫున ప్రాతినిధ్యం వహిస్తూ, ప్రతి ఎన్నికల్లోనూ ఫలితాలను శాసిస్తున్నారు. అయితే, ఈ 12 మంది సభ్యులు పీవోకే స్థానిక ప్రజల ఆకాంక్షలను ఏమాత్రం ప్రతిబింబించడం లేదని, కేవలం పాకిస్థాన్ రాజకీయ ప్రయోజనాలే నెరవేరుస్తున్నారని స్థానికులు గట్టిగా నమ్ముతున్నారు. పాకిస్తాన్ ప్రభుత్వాలు ఇప్పటివరకు కశ్మీర్‌ను తమ 'ధమని'గా అభివర్ణిస్తూ, వేర్పాటువాద ఉద్యమానికి మద్దతునిచ్చాయి. ఈ నేపథ్యంలో కశ్మీర్ నుంచి వచ్చిన వారిని వ్యతిరేకిస్తే అది ద్రోహంతో భావన ఒకప్పుడు ఉండేది. రానురానూ పాకిస్థాన్ ప్రభుత్వాలు వారికి ఇచ్చే ప్రాధాన్యత పెరగడం, స్థానికుల మనోభావాలను పట్టించుకోకపోవడం జరగుతూ వచ్చింది. శరణార్థుల రాజకీయ ప్రాభవం కూడా భారీగా పెరిగింది. ఈ పరిణామాలతో స్థానిక ప్రజల్లో ఆగ్రహ జ్వాలలు కట్టలు తెంచుకున్నాయి.

**అప్పుడు జమ్మూకశ్మీర్‌లో, ఇప్పుడు పీఓకేలో హింస**

ఒకప్పుడు జమ్మూకశ్మీర్‌లోని 10 జిల్లాల్లో ఎన్నికలు ఉంటే భారీగా బలగాలను మోహరించేవారు. పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేకంగా బలగాలను కేటాయించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి జమ్మూకశ్మీర్‌లో లేదు. కానీ, అలాంటి ఉద్రిక్త పరిస్థితులు పీఓకేలో తలెత్తున్నాయి హింసాత్మక వాతావరణం జమ్మూకశ్మీర్ నుంచి పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌కు పాకింది. గతంలో జమ్మూకశ్మీర్‌లో ఎలాంటి వ్యతిరేకత ఉండేదో, ఇప్పుడు అక్కడి ప్రజలు పూర్తిగా పాకిస్థాన్ వ్యతిరేకంగా మారుతున్నారు.

**జేఏఏసీ ఎన్నికల బహిష్కరణ- అట్టుడికిన ముజఫరాబాద్**

కశ్మీర్, ఎల్ఓసీ అవతలి వైపు నుంచి స్వల్పకాలిక బస లేదా శాశ్వతంగా స్థిరపడేందుకు వచ్చిన వారికి ఒకప్పు స్వాగతం పలికిన పీఓకేలోని ముజఫరాబాద్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో తీవ్ర ఉద్రిక్తతలో దద్దరిల్లింది. ఎన్నికలలో భాగంగా ముజఫరాబాద్‌లో నిర్వహించిన రెండో దశ పోలింగ్‌లో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. అక్కడ ఉన్న మొత్తం 1,483 పోలింగ్ కేంద్రాలలో కేవలం 209 కేంద్రాలను మాత్రమే సాధారణమైనవిగా ఎన్నికల సంఘం గుర్తించింది. మిగిలిన అన్ని కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా పేర్కొన్నదన్నదంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. 2023లో ఏర్పాటైన 'జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ' (జేఏఏసీ) జమ్మూకశ్మీర్ శరణార్థుల కోసం కేటాయించిన 12 రిజర్వుడ్ స్థనాలను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేస్తోంది. స్థానిక హక్కులు, పౌర సమస్యలపై పోరాడుతున్న జేఏఏసీ ఈ ఎన్నికలను బహిష్కరించింది. తద్వారా స్థానికుల ఆకాంక్షలకు బలమైన గొంతుకగా నిలిచింది. స్థానికులను రెచ్చగొడుతుందన్న కారణంతో ప్రభుత్వం ఈ సంస్థపై నిషేధం విధించినప్పటికీ దీనికి ఉన్న ప్రజల మద్దతు మాత్రం ఏమాత్రం తగ్గలేదు.

**ఉగ్రవాద స్థావరాలపై తీవ్ర ప్రభావం**

పీఓకేలో పెరుగుతున్న ప్రజాగ్రహం ఆ ప్రాంతంలో దశాబ్దాలుగా వేళ్లూనుకున్న ఉగ్రవాద సంస్థలు, కమాండర్లపై పెను ప్రభావం చూపే అవకాశం ఉంది. హిజ్బుల్ ముజాహిదీన్ వంటి గ్రూప్‌లకు చెందిన మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదులు భారత భద్రతా బలగాల మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్నారు. వీరికి ఇప్పటివరకు స్థానికంగా లభిస్తున్న మద్దతే ప్రధాన రక్షణగా నిలుస్తోంది. చేపకు నీరు ఎంత ముఖ్యమో, ఉగ్రవాద గ్రూప్‌లకు స్థానికుల మద్దతు అంత ముఖ్యం. ఈ చందంగా ఇప్పుడు స్థానిక ప్రజల్లో పాకిస్థాన్, దాని అనుకూల శక్తులపై అసంతృప్తి పెరిగిపోతుండటంతో, ఈ ఉగ్రవాద స్థావరాలకు లభిస్తున్న ఆదరణ క్రమంగా సన్నగిల్లుతోంది. స్థానిక మద్దతు కరువవుతున్న తరుణంలో ఉగ్రవాద కమాండర్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని, భవిష్యత్తులో ఇది మరింత అంతర్గత కలహాలకు దారితీసే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## యువతకు ఐవైసి ఎప్పుడూ తోడుంటుంది

నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా ఆందోళన చేసిన విద్యార్థులపై పోలీసుల దాడి ఘటనకు సంబంధించి కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించకపోవటాన్ని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తప్పుబట్టారు. అమిత్ షా ఏదో ఒకరోజు సమాధానం చెప్పక తప్పదన్నారు. ప్రధాని మోదీ విద్యార్థులకు క్షమాపణలు చెప్పటానికి బదులు వారినే క్షమిస్తున్నానని ప్రకటించటం విడ్డూరంగా ఉందన్నారు. ప్రయాగ్‌రాజ్‌లో శనివారం జరిగిన 'ఛాత్రోంకీ గూంజ్?' (విద్యార్థుల ప్రతిధ్వని) కార్యక్రమంలో ఓ విద్యార్థి తనతో పంచుకున్న ఆవేదనను రాహుల్ 'ఎక్స్' ద్వారా ఆదివారం పంచుకున్నారు.

ఉన్న భూమి అమ్మి, అదీ చాలక అప్పులు చేసి మరీ పరీక్షకు సిద్ధమైతే చివరికి దక్కిందేమీ లేదని బాధిత విద్యార్థి వాపోయినట్లు రాహుల్? చెప్పారు. ఇప్పుడు తనకు ఏదారీ కనిపించటం లేదని అతడు తనతో చెప్పినట్లు తెలిపారు. ఇది ఆ విద్యార్థి వైఫల్యం కాదని, అతని కష్టానికి తగిన ప్రతిఫలం ఇవ్వలేని ప్రస్తుత వ్యవస్థ వైఫల్యమని ఆయన విమర్శించారు. యువతే దేశానికి వెలుగు అని, వారికి తమ పార్టీ పూర్తి అండగా ఉంటుందని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు.

**'యువతకు ఐవైసి ఎప్పుడూ తోడుంటుంది'**

ఇండియన్ యూత్ కాంగ్రెస్ (ఐవైసీ) వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సంస్థ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. భారతదేశపు గొప్ప బలం యువతేనని ఆయన పేర్కొన్నారు. అలాగే, యువ భారతీయులకు తమ గళాలను, ఆందోళనలను వినిపించడానికి, తమ హక్కులు, కలలు, ఆకాంక్షల కోసం పోరాడటానికి ఒక వేదికను అందించడంలో ఐవైసికి ఉన్న ప్రాముఖ్యాన్ని ఎక్స్?లో ప్రస్తావించారు."ఐవైసీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఇండియన్ యూత్ కాంగ్రెస్ సభ్యులందరికీ శుభాకాంక్షలు. భారతదేశపు అతిపెద్ద బలం దాని యువతే. యువ భారతీయులకు ఒక వేదికను అందించడంలో ఐవైసికి అద్భుతమైన చరిత్ర ఉంది. యువత తమ గొంతుకనను వినిపించడంలో, వారి సమస్యలను లేవనెత్తడంలో, వారికి వ్యతిరేకంగా రూపొందించిన వ్యవస్థతో పోరాడడంలో, ఐవైసి ప్రతి అడుగులోనూ వారికి అండగా నిలుస్తుంది" అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. కాగా, రాహుల్ గాంధీ ఉత్తర్?ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లోని కెపి గ్రౌండ్‌లో శనివారం 'ఛత్రోన్ కీ గూంజ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ సమస్యపై కేంద్ర ప్రభుత్వంపై తీవ్రంగా విమర్శలు గుప్పించారు.

**ఐవైసీని ఎప్పుడు స్థాపించారు?**

భారత జాతీయ కాంగ్రెస్ యువజన విభాగమైన భారత యువజన కాంగ్రెస్ 1960 ఆగస్టు 9న స్థాపించారు. ఈ పార్టీ గతంలో కాంగ్రెస్ పార్టీలోనే ఒక భాగంగా ఉండేది. ఆ తర్వాత,అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ దీనిని ఒక అనుబంధ సంస్థగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం, ఈ సంస్థలో రెండు కోట్లకు పైగా సభ్యులు ఉన్నారు. ఈ సంస్థ 'శక్తి సూపర్ షీ' అనే ప్రచారంతో సహా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది0. అయితే, వీటి ప్రధాన లక్ష్యం కాంగ్రెస్ పార్టీతో మహిళల దేశవ్యాప్త అనుబంధాన్ని, భాగస్వామ్యాన్ని పెంపొందించడం, బలోపేతం చేయడం. ఇతర కార్యక్రమాల్లో భారత్ జోడో నాయకత్వ కార్యక్రమం, పెహ్లా ఓటు, ఇందిరా ఫెలోషిప్, యువత హక్కుల కోసం గళం విప్పడం వంటివి ఉన్నాయి. ప్రస్తుతం ఉదయ భాను చిబ్, కృష్ణ అల్లవారు ఈ సంస్థకు అధ్యక్షుడిగా, సంయుక్త కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

**ఆదివాసీలే అసలైన యజమానులు**

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం(ఆగస్టు 9) సందర్భంగా దేశంలోని ఆదివాసీ సోదర సోదరీమణులందరికీ రాహుల్? గాంధీ ఎక్స్?లో శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివాసీలే దేశపు అసలైన యజమానులని, వారి విభిన్న సంస్కృతి, సంప్రదాయాలు భారతదేశానికి లభించిన అమూల్యమైన వారసత్వ సంపదగా ఆయన కొనియాడారు. భూమి, అటవీ సంపదపై వారికి ఉన్న హక్కులతో పాటు, వారి అస్తిత్వం ఆత్మగౌరవం కోసం సాగే పోరాటంలో వారికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

## స్వాతంత్ర్య పోరాటానికి 'క్విట్ ఇండియా' కొత్త శక్తినిచ్చింది

చారిత్రాత్మక క్విట్ ఇండియా ఉద్యమం స్వాతంత్ర్య సంగ్రామానికి కొత్త శక్తిని అందించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ ఉద్యమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఆయన స్వాతంత్ర్య సమరయోధులకు ఘనంగా నివాళులర్పించారు. వారి ధైర్యసాహసాలు, త్యాగాలు రాబోయే తరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తూనే ఉంటాయని ప్రధాని పేర్కొన్నారు. ఆగస్టు విప్లవంలో పాల్గొన్న నేతలను, సమరయోధులను స్మరించుకుంటూ ప్రధాని మోదీ 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు. "మహాత్మా గాంధీ నాయకత్వ స్ఫూర్తితో ప్రారంభమైన క్విట్ ఇండియా ఉద్యమం మన స్వాతంత్ర్య పోరాటానికి నూతన ఉత్తేజాన్ని ఇచ్చింది. వలస పాలన నుంచి విముక్తి పొందాలన్న మన ప్రజల అచంచల సంకల్పాన్ని ఇది ప్రతిబింబించింది. ఈ ఉద్యమంలో పాల్గొన్న వారందరినీ స్మరించుకుంటున్నాను. వారి ధైర్యం ప్రతి భారతీయుడికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమే" అని మోదీ తన సందేశంలో తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా క్విట్ ఇండియా ఉద్యమకారులకు నివాళులర్పించారు. ఈ ఉద్యమం దేశప్రజలందరినీ ఏకతాటిపైకి తెచ్చిందని, 'డూ ఆర్ డై' (చేయండి లేదా చావండి) అనే సంకల్పాన్ని, అద్వితీయమైన ధైర్యాన్ని వారిలో నింపిందని ఆయన గుర్తు చేసుకున్నారు. జాతి ప్రయోజనాలకు ప్రథమ స్థానం ఇస్తూ, స్వదేశీని ప్రోత్సహిస్తూ ఆత్మనిర్భర్, వికసిత భారత్ లక్ష్యాల కోసం పనిచేయడానికి ఈ రోజు స్ఫూర్తినివ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సైతం ఉద్యమకారుల ధైర్యాన్ని, త్యాగాలను స్మరించుకున్నారు. 'డూ ఆర్ డై' నినాదంతో సమరయోధులు జాతీయ చైతన్యాన్ని రగిలించి స్వాతంత్ర్య పోరాటానికి ఒక నిర్ణయాత్మక దిశను చూపారని ఆయన పేర్కొన్నారు. 1942 ఆగస్టు 8న బొంబాయిలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ 'క్విట్ ఇండియా' తీర్మానాన్ని ఆమోదించిన తర్వాత ఈ ఉద్యమం ప్రారంభమైంది. అప్పుడు మహాత్మా గాంధీ 'డూ ఆర్ డై' అనే చారిత్రాత్మక పిలుపునిచ్చారు. బ్రిటిష్ పాలన అంతం కావాలని డిమాండ్ చేశారు. బ్రిటిష్ ప్రభుత్వం కఠినంగా అణిచివేసినప్పటికీ, దేశవ్యాప్తంగా నిరసనలు, సమ్మెలు వెల్లువెత్తాయి. భారత స్వాతంత్ర్య పోరాట తుది దశలో ఇది ఒక మహోద్యమంగా నిలిచింది

## నల్సార్ స్నాతకోత్సవానికి సీజేఐ వద్దు..

హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా స్నాతకోత్సవానికి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు నిరసన గళం విప్పారు. ఈ మేరకు దాదాపు 450 మంది విద్యార్థులు సంతకాలు చేసి విశ్వవిద్యాలయ యాజమాన్యానికి ఒక లేఖ రాశారు. ఈ పరిణామం తెలంగాణ న్యాయ విద్యా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే, 2026 బ్యాచ్ స్నాతకోత్సవానికి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించే ప్రతిపాదనను విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఢిల్లీలో జరిగిన నీట్ నిరసనలపై సుప్రీంకోర్టులో జూలై 22న జరిగిన విచారణ సందర్భంగా సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం చేసిన వ్యాఖ్యలే ఈ నిరసనకు ప్రధాన కారణం. ఆ రోజు విచారణ సందర్భంగా, నిరసనకారులపై పోలీసుల చర్యకు సంబంధించిన వీడియోలపై సుమోటో విచారణ చేపట్టడానికి ధర్మాసనం నిరాకరించింది. ఈ క్రమంలో సీజేఐ, "వీడియోలు చూసే ఆసక్తి మాకు లేదు," "మా సమయాన్ని, మీ సమయాన్ని వృథా చేయకండి" వంటి వ్యాఖ్యలు చేశారని విద్యార్థులు తమ లేఖలో పేర్కొన్నారు. సీజేఐ వ్యాఖ్యలు అసంబద్ధంగా, బాధ్యతారహితంగా ఉన్నాయని, అందుకే ఆయనను స్నాతకోత్సవానికి పిలవరాదని వారు డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్‌కు మద్దతుగా విద్యార్థులు ఇప్పటికే ఒక పూట భోజనం చేయకుండా నిరసన తెలిపారు. తమ అభ్యర్థనను యాజమాన్యం పట్టించుకోకపోతే, వారం రోజుల నోటీసు ఇచ్చి ఆందోళనలు మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అయితే, నల్సార్ యాజమాన్యం స్నాతకోత్సవం తేదీని గానీ, ముఖ్య అతిథిని గానీ అధికారికంగా ఇంకా ప్రకటించలేదు. కానీ, ప్రతి ఏటా సీజేఐని స్నాతకోత్సవానికి ఆహ్వానించడం నల్సార్‌లో ఒక సంప్రదాయంగా వస్తోంది. కాగా, సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ విద్యార్థుల నిరసనను ఎదుర్కోవడం ఇది రెండోసారి. ఈ నెల మొదట్లో ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లో జరగాల్సిన 86వ స్నాతకోత్సవానికి కూడా ఆయనే ముఖ్య అతిథిగా హాజరు కావాల్సి ఉంది. అయితే, ఎస్ఎఫ్ఐ అనుబంధ విద్యార్థులు నిరసన తెలిపే అవకాశం ఉందన్న ఇంటెలిజెన్స్ సమాచారంతో ఆ కార్యక్రమాన్ని చివరి నిమిషంలో వాయిదా వేశారు. ఇప్పుడు టిస్ తర్వాత నల్సార్‌లోనూ అదే పరిస్థితి పునరావృతం కావడం గమనార్హం. విద్యార్థుల లేఖతో నల్సార్ యాజమాన్యం ఇప్పుడు ఇరకాటంలో పడింది.

# మౌలిక వసతులు, విద్య, వైద్యానికి పెద్దపీట

-మొదటిపేజీ తరువాయి

గిరిజన సమాజానికి సమగ్ర అభివృద్ధి, సంక్షేమంపై పలు కీలక హామీలు ఇస్తూ, వారి హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు. సాధారణ ఆదివాసీ కుటుంబంలో పుట్టి, అనేక కష్టాలను అధిగమించి, దేశ ప్రథమ పౌరురాలిగా అత్యున్నత శిఖరాలను అధిరోహించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని చంద్రబాబు అన్నారు. ఆమె స్ఫూర్తితో గిరిజన యువత ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని సూచించారు. జాతీయ జెండాతో పాటు మీ అజెండా కూడా ఉండాలని పిలుపునిచ్చారు.

“సంకల్పం బలంగా ఉంటే ఏదైనా సాధించవచ్చు. ద్రౌపది ముర్ము, అబ్దుల్ కలాం, బీఆర్ అంబేద్కర్, ఎన్టీఆర్, నరేంద్ర మోదీ వంటి మహనీయులంతా సాధారణ కుటుంబాల నుంచి వచ్చినవారే. ‘నేను ఏంటి? ఎలా ఎదగాలి? ఈ సమాజానికి, దేశానికి నేనేం ఇవ్వాలి?’ అనే లక్ష్యంతో పనిచేయాలి. మీ విజయం దేశ విజయమవుతుంది..” అని ఆయన పేర్కొన్నారు. ఈ స్ఫూర్తిని వ్యాపింపజేసేందుకు ఆగస్టు 9 నుంచి 15 వరకు ‘అనే నేను’ పేరుతో ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

### గిరిజన ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండింగ్.. అరకు కాఫీ ఒక సక్సెస్ స్టోరీ

గిరిజన ప్రాంతాల్లోని ఆర్థిక స్వావలంబనపై చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. తాను 25 ఏళ్ల క్రితం ఒక చిరు ప్రయత్నంగా ప్రారంభించిన అరకు కాఫీ, నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతి గాంచడాన్ని ఆయన గుర్తుచేశారు. “అరకు కాఫీకి నేనే పేరు పెట్టాను. దానిని మార్కెటింగ్ చేసి, ప్రధాని నరేంద్ర మోదీ నుంచి ఆస్ట్రేలియా ప్రధాని వరకు బహూకరించి, గ్లోబల్ బ్రాండ్‌గా నిలబెట్టాను. ఇవాళ పారిస్‌లో కూడా అరకు కాఫీ స్టాళ్లు ఉన్నాయి” అని గర్వంగా ప్రకటించారు.

ఇదే స్ఫూర్తితో సీతంపేట పసుపు, రంపచోడవరం రబ్బర్, పార్వతీపురం పైనాపిల్, తేనె, తాటిబెల్లం వంటి స్థానిక ఉత్పత్తులకు విలువ జోడించి, బ్రాండింగ్ చేసి, మార్కెటింగ్ చేసే బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంటుందని హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల్లోని రైతులు పండించే ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ సంస్థలతో 19 అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) కుదుర్చుకున్నట్లు వెల్లడించారు.

### మౌలిక వసతులు, విద్య, వైద్యానికి పెద్దపీట

గిరిజన ప్రాంతాల సమగ్రాభివృద్ధికి నాలుగు కీలక రంగాలపై దృష్టి పెడుతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యం, ఆదాయ మార్గాల పెంపునకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. మౌలిక వసతులు: డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో 2,336 గిరిజన ఆవాసాలకు మిషన్ మోడ్‌లో రోడ్ కనెక్టివిటీ కల్పిస్తామన్నారు. ‘జల్ జీవన్ మిషన్’ కింద 2027 డిసెంబర్ నాటికి ప్రతి గిరిజన ఇంటికి కుళాయి ద్వారా సురక్షిత నీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. మారుమూల గ్రామాలకు సైతం టెలికాం కనెక్టివిటీ అందించి, డోలీ మోతలు లేని సమాజాన్ని నిర్మిస్తామన్నారు. విద్య: ‘తల్లికి వందనం’ కింద 4.92 లక్షల మంది గిరిజన విద్యార్థులకు రూ.650 కోట్లు అందించామని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. విశాఖలోని మేకవారిపాలెంలో 600 మంది విద్యార్థులతో ‘సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్’ ఏర్పాటు చేసి, ఐఐటీ వంటి జాతీయ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఏటా కనీసం 100 మంది గిరిజన విద్యార్థులు జాతీయ స్థాయి సంస్థల్లో సీట్లు సాధించడమే లక్ష్యమన్నారు. వైద్యం: పాడేరులో మెడికల్ కాలేజీతో పాటు పార్వతీపురం, రంపచోడవరం, శ్రీశైలం వంటి ప్రాంతాల్లో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మిస్తామన్నారు. ‘సంజీవిని’ ప్రాజెక్ట్ ద్వారా ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలను డిజిటలైజ్ చేస్తామని, సికిల్ సెల్ అనీమియా బాధితులకు రూ.10,000 పింఛను అందిస్తూ, వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తామని ప్రకటించారు.

### జీవో నెంబర్ 3 పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం

గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలు స్థానికులకే దక్కాలనే ఆశయంతో ఎన్టీఆర్ హయాంలో పురుడుపోసుకుని, తాను 2000 సంవత్సరంలో తీసుకొచ్చిన జీవో నెంబర్ 3ను కాపాడతామని చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. సుప్రీంకోర్టులో ఈ జీవోను కొట్టివేయడానికి గత ప్రభుత్వ వైఫల్యమే కారణమని విమర్శించారు. “ఈ జీవోను చట్టపరంగా, రాజ్యాంగబద్ధంగా నిలబడేలా పటిష్టమైన కార్యాచరణ రూపొందిస్తాం. ఆదివాసుల హక్కుల పరిరక్షణకు ఈ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఆవేశంతో కాకుండా ఆలోచనతో, అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని దీనిపై ముందుకు వెళతాం” అని భరోసా ఇచ్చారు.

గిరిజన ప్రాంతాలను కేవలం వెనుకబడిన ప్రాంతాలుగా కాకుండా, అపార అవకాశాలున్న ప్రాంతాలుగా చూస్తున్నామని, అక్కడి పచ్చదనం, స్వచ్ఛమైన వాతావరణాన్ని ఉపయోగించుకుని టూరిజం హబ్‌లుగా తీర్చిదిద్దుతామని అన్నారు. ప్రతి గిరిజన ఇల్లు ‘అతిథి గృహం’గా మారాలని, తద్వారా ప్రపంచానికి ఆతిథ్యం ఇవ్వాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఒక చెట్టు నాటి, దానిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 2047 నాటికి ‘వికసిత్ భారత్’, ‘స్వర్ణాంధ్రప్రదేశ్’ లక్ష్యాలను సాధించడంలో ఆదివాసీలు కీలక పాత్ర పోషించాలని, వారి సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పునరుద్ఘాటించారు.

# ప్రకాష్ గౌడ్ ఫ్యామిలీ వార్

**హైదరాబాద్ :** రాజేంద్రనగర్ రాజకీయం వేడెక్కింది. అధికారం, కుటుంబ బంధాలు, వ్యక్తిగత వివాహ నిర్ణయాలు కలగలిసి ఒక సంచలనాత్మక పొలిటికల్ డ్రామాకు తెరలేపాయి. నియోజకవర్గంలో తిరుగులేని నాయకుడిగా గుర్తింపు పొందిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు సొంత ఇంట్లోనే ఊహించని సవాలు ఎదురైంది. ఆయన కుమారుడు సంతోష్ గౌడ్ నేరుగా తండ్రిపైనే తీవ్రస్థాయిలో తిరుగుబాటు బావుటా ఎగరవేసి, మీడియా ముందుకు రావడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ప్రజాప్రతినిధిగా అధికార పీఠంపై ఉన్న తండ్రికి, తన ప్రేమ వివాహానికి రక్షణ కోరుతున్న కుమారుడికి నడుమ సాగుతున్న ఈ పోరు ఇప్పుడు తెలంగాణలో హాట్ టాపిక్‌గా మారింది.ఈ వివాదానికి మూలం సంతోష్ గౌడ్ ప్రేమ వివాహ నిర్ణయమే. రూపా రెడ్డి కుమార్తెను వివాహం చేసుకోవాలని నిశ్చయించుకున్నప్పటి నుంచి కుటుంబంలో తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. కేవలం వివాహాన్ని అడ్డుకోవడమే కాకుండా, తమకు మద్దతుగా నిలిచిన వారిపై భౌతిక దాడులు చేయిస్తున్నారని సంతోష్ నేరుగా ఎమ్మెల్యేపైనే సంచలన ఆరోపణలు చేశారు. ఇటీవల మణికొండలోని రూపా రెడ్డి నివాసంలో అపరిచిత వ్యక్తులు ప్రవేశించి సృష్టించిన అలజడి వెనుక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హస్తం ఉందని, అంతర్గత ఆస్తి తగాదాలు, మనస్పర్థలే ఈ దాడులకు

కారణమని ఆయన స్పష్టం చేశారు.అధికార వర్గాల ఒత్తిడి, పోలీసుల వైఖరిపై కూడా సంతోష్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రాణభయంతో అత్యవసరంగా డయల్-100 ద్వారా రక్షణ కోరినప్పటికీ, నార్సింగ్ పోలీసులు స్పందించిన తీరు అనుమానాస్పదంగా ఉందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధి రాజకీయాధికారానికి పోలీసులు తలొగ్గారని, బాధితులకు న్యాయం చేయాల్సింది పోయి, రివర్స్‌లో తమపైనే అక్రమ కేసులు బనాయించేందుకు కుట్ర పన్నుతున్నారని ఆయన ఆరోపించారు. నిజాలు బయటపెట్టినందుకు తమ ప్రాణాలకు మరింత ముప్పు పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు.అటు




బాధితురాలు రూపా రెడ్డి సైతం ఇది ఒక ముందస్తు ప్రణాళిక ప్రకారం జరుగుతున్న రాజకీయ కుట్ర అని పేర్కొన్నారు. తమను జైలుకు పంపించేందుకు ఎమ్మెల్యే వర్గం తీవ్ర ప్రయత్నాలు చేస్తోందని, ప్రశాంతంగా జీవించే తమ కుటుంబానికి పోలీసు ఉన్నతాధికారులు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అయితే, ఈ డ్రామాలో ఊహించని మలుపుగా రూపారెడ్డిని పోలీసులు చిట్టీల పేరుతో మోసాలకు పాల్పడ్డారనే కేసులో అరెస్టు చేయడం స్థానికంగా మరింత ఉత్కంఠను పెంచింది. ఇది పోలీసులపై వచ్చిన ఆరోపణల కవర్-అప్ చర్యనా లేక పాత కేసుల అమలులో భాగమా అనే చర్చ మొదలైంది.మరోవైపు ఈ సంచలన ఆరోపణలపై ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శైలి వ్యూహాత్మకంగా ఉంది. వాడెవడో తనకు తెలియదని, ఈ వ్యవహారంతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన సింపుల్ గా కొట్టి పారేశారు. సొంత కుమారుడి గుర్తింపునే ప్రశ్నించేలా వ్యాఖ్యానించడం ద్వారా ఈ వివాదం తీవ్రతను తగ్గించేందుకు ప్రయత్నించారా లేక సరైన సమయంలో పూర్తిస్థాయి సమాధానం చెప్పేందుకు సమయం తీసుకుంటున్నారా అనే కోణంలో విశ్లేషకులు భావిస్తున్నారు.మొత్తానికి రాజేంద్రనగర్ శాసనసభ్యుడి కుటుంబంలో రగులుకున్న ఈ నిప్పు, ఇప్పుడు తెలంగాణ వ్యాప్తంగా రాజకీయంగా పెద్ద దుమారాన్నే రేపుతోంది. అధికార బలం, కుటుంబ అంతర్గత వివాదాలు, పోలీసు వ్యవస్థ తీరు కలగలిసిన ఈ ఎపిసోడ్ రాబోయే రోజుల్లో ఏ మలుపు తిరుగుతుందో వేచి చూడాలి.

# 100 ఎకరాల్లో బస్ డిపో

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో ట్రాఫిక్ పెరుగుతోంది.. ఎక్కడికక్కడే ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు ఏర్పాటు చేసినా సరే ట్రాఫిక్ మాత్రం తగ్గడం లేదు. మెట్రో రైలుతో పాటుగా ఆర్టీసీ ప్రజా రవాణా అందుబాటులో ఉన్నా సరే ట్రాఫిక్ కష్టాలు మాత్రం కొనసాగుతున్నాయి. ప్రతిరోజూ నగరంలో వాహనాలకు తోడు తెలంగాణలోని ఇతర జిల్లాలతో పాటుగా ఇతర రాష్ట్రాల నుంచి ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు హైదరాబాద్‌కు వస్తున్నాయి. ముఖ్యంగా ఏపీతో పాటుగా కర్ణాటక, మహారాష్ట్రల నుంచి ఆర్టీసీ బస్సులు నగరానికి రాకపోకలు కొనసాగిస్తున్నాయి. ఆర్టీసీ బస్సుల కోసంఎంజీబీఎస్, జేబీఎస్ బస్ స్టేషన్‌లు ఉన్నాయి.. అయినా సరే ఒత్తిడి ఏమాత్రం తగ్గడం లేదు. అందుకే తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో మరో బస్టాండ్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది.. టీజీఎస్ఆర్టీసీ 100 ఎకరాల్లో అత్యాధునిక బస్ టెర్మినల్‌ను ప్లాన్ చేసింది. తాజాగా ఈ

డిపోకు సంబంధించి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కీలక ప్రకటన చేశారు.తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ జగద్గిరిగుట్ట దగ్గర బస్ డిపో నిర్మాణం కోసం కుత్బుల్లాపూర్ మండలం గాజుల రామారం దగ్గర 100 ఎకరాలు




కేటాయించినట్లు నితిన్ గడ్కరీ తెలిపారు. లోక్‌సభలో ఎంపీలు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నకు గడ్కరీ సమాధానం ఇచ్చారు. హైదరాబాద్ పరిధిలోని జగద్గిరిగుట్ట మీదుగా 28 జిల్లా బస్సులు, 47 సిటీ బస్సులు కలిపి రోజూ 404 ట్రిప్పుల వరకు తిరుగుతాయన్నారు. టీజీఎస్ఆర్టీసీ బస్ డిపో, టెర్మినల్ నిర్మాణం కోసం 99 ఏళ్లకు లీజుకు తీసుకోవడానికి హెచ్‌ఎంటీకి చెందిన స్థలాన్ని గుర్తించిందన్నారు.కానీ హెచ్‌ఎంటీ అధికారులు.. అంత సుదీర్ఘకాలం స్థలాన్ని లీజుకు ఇవ్వలేమని, 5 ఏళ్లకోసారి చొప్పున గరిష్ఠంగా 20 ఏళ్లకు మాత్రమే ఇస్తామని చెప్పారన్నారు. దీని

కోసం ఏటా రూ.6 కోట్ల లైసెన్స్ ఫీజు చెల్లించాలని చెప్పగా.. ఆ ప్రతిపాదనకు టీజీఎస్ఆర్టీసీ అంగీకరించలేదన్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం టీజీఎస్ఆర్టీసీకి గాజులరామారం దగ్గర హెచ్‌ఎంటీ భూములకు సమీపంలో 100 ఎకరాలు కేటాయించినట్లు కేంద్రమంత్రి గడ్కరీ తెలిపారు. గాజుల రామారంలో ఏర్పాటు చేయబోయే డిపోలో ఇంటర్ స్టేట్ బస్సు సర్వీసుల కోసం ప్రత్యేకంగా బస్ టెర్మినల్ ప్లాన్ చేశారు. సిటీ బస్సుల కోసం మరో టెర్మినల్, ఎలక్ట్రిక్ బస్సుల కోసం ప్రత్యేక ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్‌కు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే బస్సు కారణంగా ట్రాఫిక్ సమస్యలు రాకుండా ప్రణాళికలు తయారు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాలు, తెలంగాణలోని ఇతర జిల్లాల నుంచి వచ్చే బస్సులు ఈ డిపోకు వెళ్లనున్నాయి. అప్పుడు ఎలాంటి సమస్య ఉండదని భావిస్తున్నారు

## వేగవంతమైన పరిపాలన

-మొదటిపేజీ తరువాయి

విజయవాడ -- మంగళగిరి రహదారిని సీడ్ యాక్సెస్ రోడ్డుతో అనుసంధానించేందుకు బకింగ్‌హాం కెనాల్, గుంటూరు ఛానళ్లపై నిర్మించిన స్టీల్ బ్రిడ్జిలను ముఖ్యమంత్రి మొదట ప్రారంభిస్తారు. అక్కడి నుంచి సీడ్ యాక్సెస్ రోడ్డు మీదుగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అపార్ట్‌మెంట్ టవర్ల వద్దకు చేరుకుంటారు. అక్కడ ప్రజాప్రతినిధుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 6 ఎమ్మెల్యే టవర్లు, 3 ఎమ్మెల్సీ టవర్లలో మొత్తం 207 అత్యాధునిక ఫ్లాట్లు సిద్ధం చేశారు. వాటి తాళాలను సీఆర్‌డీఏ అధికారులు సీఎంకు అందజేస్తారు. ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్న శాసనసభ వర్షాకాల సమావేశాల సమయంలో ప్రజాప్రతినిధులకు ఈ ఫ్లాట్లను కేటాయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

ప్రస్తుతం రాజధానిలోని దొండపాడు నుంచి విజయవాడ -- మంగళగిరి రోడ్డు వరకు 18.270 కిలోమీటర్ల మేర 9 వరుసల రహదారిగా సీడ్ యాక్సెస్ రోడ్డును తీర్చిదిద్దుతున్నారు. రాజధానిలో ఉత్తరం నుంచి దక్షిణానికి నిర్మిస్తున్న ప్రతి రహదారి సీడ్‌యాక్సెస్ రోడ్డుతో అనుసంధానమవుతాయి. దీన్ని తొమ్మిది వరుసల రహదారిగా నిర్మించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఈ రహదారిని మణిపాల్ ఆసుపత్రి వరకు విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయడమే కాకుండా రాజధానిలో ఉత్తర -- దక్షిణ రహదారులన్నింటినీ దీనికి అనుసంధానిస్తున్నారు. అత్యాధునిక మౌలిక వసతులతో రూపుదిద్దుకున్న ఈ ప్రాజెక్టులు ప్రజలకు వేగవంతమైన పరిపాలనను చేరవేసేందుకు దోహదపడతాయి.

## నిందితులను అరెస్ట్ చేశాం..
## ప్రియాంక కుటుంబానికి న్యాయం చేస్తాం

-మొదటిపేజీ తరువాయి

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. అనంతరం మంత్రి అనిత.. బాధితురాలు ప్రియాంక తండ్రి వెంకటేశ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఆయనకు ధైర్యం చెప్పి, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు వేగంగా స్పందించారని, నిందితులను ఇప్పటికే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని మంత్రి తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తును వేగవంతం చేసి, చట్టప్రకారం దోషులకు కఠిన శిక్ష పడేలా చూస్తామని స్పష్టం చేశారు. ప్రియాంక కుటుంబానికి న్యాయం జరిగేలా చూసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని ఆమె హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి పూర్తిస్థాయిలో అండగా నిలుస్తామని హోంమంత్రి పునరుద్ఘాటించారు.

## విజయసాయి పార్టీకి స్పేస్ ఉందా



**నెల్లూరు :** ఏపీలో మరో కొత్త పార్టీకి తెర లేవనుందని లోకల్ పొలిటికల్ సర్కిల్స్‌లో టాక్. పొలిటికల్ ఎంట్రీకి మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి రంగం సిద్ధం చేసుకుంటున్నారని సమాచారం. 2029 ఎన్నికలే టార్గెట్‌గా విజయసాయి వ్యూహం రచిస్తున్నట్టు సమాచారం. తన పార్టీకి వెన్నుదన్నుగా ఉండేలా సొంత మీడియాను కూడా ఆయన ఏర్పాటు చేసుకుంటున్నారని తెలుస్తోంది. సోషల్ మీడియా, మీడియా ప్లాట్‌ఫామ్‌ల అండతో తన వాయిస్‌ని, వాదనని ప్రజల్లోకి తీసుకెళ్లేలా చూసుకుంటున్నారట.ఏపీ రాజకీయాలు వైసీపీ వర్సెస్ కూటమి అన్నట్టు సాగుతూ ఉంటాయి. అక్కడ మిగిలిన పార్టీలకు పెద్దగా పొలిటికల్ స్పేస్ ఉండదు. ఇలాంటి పరిస్థితుల్లో?.విజయసాయిరెడ్డి పార్టీకి ఎంతవరకు పొలిటికల్ స్పేస్ దొరుకుతుందో చూడాలంటున్నాయి పొలిటికల్ సర్కిల్స్.చాలాకాలం వైసీపీలో ఉన్న ఆయన, కొన్నాళ్ల కిందట ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. అడపాదడపా వైసీపీ టార్గెట్‌గా విమర్శల బాణాలు సంధిస్తున్నారు. వైసీపీకి వ్యతిరేకంగా చీలో పోస్టులు పెడుతున్నారు. అటు టీడీపీపై కూడా విమర్శలు ఎక్కుపెడుతున్నారు. రాజధాని నిర్మాణంలో అవినీతి జరుగుతోందని ఆరోపిస్తున్నారు. ఆయన వైసీపీని వద్దనుకున్నారు. టీడీపీలోకి ఎంట్రీ ఇచ్చే పరిస్థితి లేదు. అయితే బీజేపీకి కోరస్‌గా హిందుత్వ సైరన్ మోగిస్తున్నారు. మొదట్లో ఆయన బీజేపీలోకి వెళదామనుకున్నారనే టాక్ వినిపించింది. అయితే కూటమిలో భాగస్వామిగా ఉన్న బీజేపీలోకి ఆయన వెళ్లే అవకాశం తక్కువగా ఉందంటున్నారు.దీంతో సొంత పార్టీ పెట్టాలనే నిర్ణయానికి వచ్చారట విజయసాయి రెడ్డి. దీనిలో భాగంగా ప్రాంతాలవారీగా త్వరలోనే సన్నాహక సమావేశాలు పెట్టడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తోంది. కొత్త పార్టీపై శ్రావణమాసంలో అధికారికంగా ప్రకటన చేయడానికి విజయసాయి సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఈ కొత్త పార్టీ ఏర్పాటు విషయంలో లెక్కల మాస్టారు ఆచితూచి అడుగులు వేస్తున్నట్టు చెబుతున్నారు. జెండాను, అజెండాను కేర్‌ఫుల్‌గా డిజైన్ చేస్తున్నారట. మోదీని ఆదర్శంగా తీసుకుని రాజకీయం చేయనున్నారట విజయసాయి. ఇక జెన్-జీ టార్గెట్‌గా పాలిటిక్స్ ఉంటాయని సమాచారం. జెన్-జీని ఆకట్టుకునే అజెండా, వ్యూహాలు రూపొందిస్తారట. దానిలో భాగంగా పార్టీలో యువతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తారని సమాచారం. రాబోయే ఎన్నికల్లో పార్టీ టికెట్లలో ఎక్కువభాగం వాళ్లకే అని చెబుతున్నారు. ఇక తమిళనాడు ఎన్నికల్లో విజయదుందుభి మోగించిన విజయ్‌ను కూడా విజయసాయి స్ఫూర్తిగా తీసుకున్నట్టు తెలుస్తోంది. విజయ్ తరహాలో డబ్బు లేని రాజకీయంపై ఫోకస్ పెట్టనున్నారట. ఇక హిందుత్వం సెంట్రిక్‌గా సాగే విజయసాయి రాజకీయంలో?సమానత్వం, కులాలకు అతీతంగా సామాజిక న్యాయం అంశాలను పొందుపరిచారట. యువత, మహిళలు, రైతులను ఆకర్షించేలా పార్టీ విధానాలు ఉంటాయని చెబుతున్నారు. పార్టీకి బూస్టప్ ఇచ్చేందుకు, విజయసాయిరెడ్డి త్వరలో పాదయాత్రకు కూడా సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది.

## అనంతపురం పాలిటిక్స్ హీట్..
## జేసీ వర్సెస్ కేతిరెడ్డి

**అనంతపురం :** అనంతపురం జిల్లా పెద్దవడుగూరులో అధికార టీడీపీ, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీల పోటాపోటీ కార్యక్రమాలతో రాజకీయ ఉత్కంఠ పీక్స్‌కు చేరింది. డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయంటూ వైసిపి శ్రేణులు రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చాయి. ఇందులో భాగంగానే వైసిపి తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పెద్దవడుగూరులో ఒక భారీ నిరసన దీక్ష చేపట్టేందుకు అన్ని సన్నాహాలు చేసుకున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే టీడీపీ సీనియర్ నేత, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి సైతం అదే నియోజకవర్గ పరిధిలోని పెద్దవడుగూరులో స్థానిక టీడీపీ కార్యకర్తలతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేయడం రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేపుతోంది.ఒకే లొకేషన్‌లో అటు ప్రతిపక్ష వైసీపీ నిరసన దీక్ష, ఇటు అధికార టీడీపీ కీలక నేత జేసీ ప్రభాకర్ రెడ్డి సమావేశం ఒకేసారి జరగనుండటంతో పెద్దవడుగూరులో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇరు పార్టీల క్యాడర్ భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండటంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక పోలీస్ యంత్రాంగం పూర్తిగా అప్రమత్తమైంది. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు పట్టణంలోని ముఖ్య కూడళ్లలో భారీగా పోలీసు బలగాలను మోహరించి నిఘా పెట్టారు. డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న అక్రమాల ఆరోపణలను తిప్పికొట్టేలా టీడీపీ నేతలు వ్యూహాలు రచిస్తుండటంతో తాడిపత్రి పాలిటిక్స్ మరోసారి హీటెక్కాయి.రాజకీయంగా ఎప్పుడూ సెన్సేషనల్ గా ఉండే తాడిపత్రి నియోజకవర్గంలో జేసీ ప్రభాకర్ రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డిల తాజా కదలికలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ నిరసన దీక్షకు పోలీసులు అనుమతి ఇస్తారా, లేదా అనే ఉత్కంఠ నడుస్తుండగానే ఇరు వర్గాలు సవాల్ ప్రతిసవాళ్లకు దిగడం పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చింది. ఒకే చోట జరుగుతున్న ఈ రెండు భిన్నమైన పొలిటికల్ యాక్టివిటీస్ రాబోయే గంటల్లో ఎలాంటి మలుపులు తిరుగుతాయోనని జిల్లా వ్యాప్తంగా సర్వత్రా చర్చ సాగుతోంది. ఈ ఉద్రిక్త పరిస్థితులను అదుపు చేయడానికి పోలీసులు ఇరు పార్టీల ముఖ్య నేతలను ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేసే అవకాశాలు కూడా ఉన్నట్లు స్థానిక వర్గాల నుండి సమాచారం అందుతోంది.

# గన్నవరం సచివాలయంలో నేత్రపర్వంగాద 'ప్రపంచ ఆదివాసీ దినోత్సవం'

### జల, జంగల్, జమీన్ హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి

### ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం మనందరి బాధ్యత




గన్నవరం సచివాలయంలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు - ఆదివాసీ సంస్కృతి పరిరక్షణకు కృషి చేయాలి

**ఎటపాక, ఆగస్టు 9 (ప్రజాజ్యోతి):**గిరిజనుల ఆత్మగౌరవ ప్రతీక అయిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఎటపాక మండలంలోని గన్నవరం గ్రామ సచివాలయ ప్రాంగణంలో ఆదివారం అత్యంత ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆదివాసీ నాయకులు, సచివాలయ అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్థులు విశేష సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో భాగంగా మొదటగా పోరాట యోధులు, గిరిజన మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రసంగించిన నాయకులు, ఆదివాసీల ప్రత్యేక సంస్కృతి, జీవన విధానం, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉద్ఘాటించారు. జల, జంగల్, జమీన్ అనే నినాదంతో సాగిన గిరిజన పోరాటాల స్ఫూర్తిని నేటి తరం ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ ప్రాంతాలలో విద్యా, వైద్య సదుపాయాలను మరింత మెరుగుపరచడంతో పాటు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి, గిరిజన హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని కోరారు. చట్టసభలు అందించిన ప్రత్యేక హక్కులను సద్వినియోగం చేసుకుంటూ సామాజికంగా, ఆర్థికంగా గిరిజనులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎటపాక టీడీపి మండల అధ్యక్షుడు బొల్లా పుల్లయ్య, ఎంపీటీసీ కంటే రాజు, గన్నవరం గ్రామ ఇన్‌చార్జ్ కార్యదర్శి సోడే హరిబాబు, మాజీ సర్పంచ్ గడ్డం భద్రమ్మ, డిజిటల్ అసిస్టెంట్ అనిల్, కృష్ణవరం గ్రామ సచివాలయం కార్యదర్శి విజయ, వెల్ఫేర్ అసిస్టెంట్ జయ, వెటర్నరీ అసిస్టెంట్ వెంకన్న బాబు, మహిళా పోలీస్ లక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్ సీతారామ, ఉపాధి హామీ సిబ్బంది కోవాసి వీరేంద్ర కుమార్, ఆదివాసీ నాయకులు గొంది నరేంద్ర కుమార్, నరేష్‌లతో పాటు మహిళలు, యువకులు, గ్రామ గిరిజన పెద్దలు పాలుపంచుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కూనవరం మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

**ఆదివాసి హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటం**

**ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేయాలి**



**కూనవరం, ఆగస్టు 9: ప్రజా జ్యోతి** ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కూనవరం మండల పరిషత్ కార్యాలయంలో ఆదివాసీ జెండాను ఘనంగా ఆవిష్కరించారు. ఎంపీపీ పాయం రంగమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆదివాసీల హక్కులు, అస్తిత్వం, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కోసం ఐక్యంగా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించడంతో పాటు వారి జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని వారు పేర్కొన్నారు. ఆదివాసీ సమాజ అభివృద్ధి, హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గుజ్జ విజయ, వైస్ ఎంపీపీ బండారు సాంబశివరావు, ఆదివాసీ నాయకులు కుంజా అనిల్, సోడె ముత్తయ్య, ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తుష్టి జోగారావు, పీసా కమిటీ సభ్యులు, మండల పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# గౌరీదేవిపేట సచివాలయంలో ఘనంగా ఆదివాసీ దినోత్సవ వేడుకలు

**ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేయాలి**

**గ్రామ కమిటీ అధ్యక్షుడు అమరవరపు రాము**



గౌరీదేవిపేట సచివాలయంలో ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో పాల్గొని ప్రముఖ ఆదివాసీ నాయకుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న గ్రామ కమిటీ అధ్యక్షుడు అమరవరపు రాము



గౌరీదేవిపేటలో ఆదివాసీ దినోత్సవ వేడుకల సందర్భంగా జెండా ఆవిష్కరిస్తున్న గ్రామ కమిటీ అధ్యక్షుడు అమరవరపు రాము, పాల్గొన్న గ్రామస్తులు

**ఎటపాక, ఆగస్టు 9 (ప్రజాజ్యోతి):** ఎటపాక మండలంలోని గౌరీదేవిపేట గ్రామ సచివాలయంలో ఆదివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకులు, గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది పాల్గొని ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల ప్రాముఖ్యతను వివరించారు. ఆదివాసీల హక్కుల పరిరక్షణతో పాటు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గ్రామ కమిటీ అధ్యక్షుడు అమరవరపు రాము పిలుపునిచ్చారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు భావితరాలకు అందేలా పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం ప్రముఖ ఆదివాసీ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు అమరవరపు రాము, కార్యదర్శి శ్రీలక్ష్మి, వీఆర్వో కన్నమ్మ, గ్రామ ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, మాజీ సర్పంచ్ ఉలవల శివ కనకరాజు, మాజీ ఉప సర్పంచ్ మడకం నరసింహారావు, మల్లెల లక్ష్మణరావు, కేసబోయిన సిద్దు, షేక్ రఫీ, చంద్రు రాజా, గడ్డం కొండయ్య, జక్కుల శ్రీను, మహిళా పోలీస్, మహిళలు, యువకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రేపాకలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

**ఆదివాసీ జెండా ఎగురవేసిన గిరిజన సంఘం నాయకులు**

**-- హక్కుల పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలని పిలుపు**





**కూనవరం, ఆగస్టు 9: ప్రజా జ్యోతి** కూనవరం మండలం రేపాక గ్రామంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివాసీ జెండాను ఘనంగా ఎగురవేసి వేడుకలను నిర్వహించారు. గిరిజన సంఘం మండల కమిటీ సభ్యులు, నాయకులు, మహిళా సంఘం నాయకులు, గ్రామ పెద్దలు, ఆదివాసీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం సీనియర్ నాయకుడు మడకం బొజ్జి, ఫిసా కార్యదర్శి మడకం రత్తయ్య, పెద్దార్కూర్ మాజీ సర్పంచ్ నాగమణి, మడకం సత్యనారాయణ, మడకం జోగయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే మహిళా సంఘం నాయకురాలు మడకం లక్ష్మి, కుమారి, గౌరి, సీతమ్మ, జయమ్మతో పాటు పలువురు గ్రామ పెద్దలు, ఆదివాసీ మహిళలు పాల్గొని ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీల హక్కులు, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఐక్యంగా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

# నంద్యాల నియోజకవర్గ కౌలు రైతులకు ఆర్థిక సహకారం అందించనున్న గోళ్ళ రాజేష్.

**నాడు మోంథతుఫాన్ వల్ల నష్టపోయి ప్రతి కౌలు రైతులకు అండగా 3000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు గోళ్ళ రాజేష్**

**కౌలు రైతులకు అండగా ఇంకా మరెన్నో సహకారాలు అందించేందు ఎల్లప్పుడూ సిద్దం.. గోళ్ళ రాజేష్**

**నంద్యాల నియోజకవర్గ కౌలు రైతులు తమ పేరును పట్టణంలోని గోళ్ళ రాజేష్ కార్యాలయంలో తమ పేరును నమోదు చేసుకోండి**




**నంద్యాల:ఆగస్టు=09 ప్రజాజ్యోతి** అతి త్వరలోనే నంద్యాల నియోజకవర్గ కౌలు రైతులకు అండగా ఆర్థిక సహాయం అందించనున్న నంద్యాల వాసి ప్రముఖ వ్యాపారవేత్త,సామాజికవేత్త గోళ్ళ రాజేష్..నంద్యాల నియోజకవర్గంలో ఇప్పటికే ఎన్నో రకాలుగా సేవ సహాయ, సహకారాలు,ఆర్థిక సహకారాలు అందిస్తూ వస్తున్నారు మన నంద్యాల వాసి గోళ్ళ రాజేష్ ఇది మన నంద్యాల నియోజకవర్గ ప్రజలందరికీ విదితమేనని తెలియజేస్తు ఇటీవల కొంతమంది వ్యాపారులకు వడ్డీకి తెచ్చిన డబ్బుతో వ్యాపారాలను నిర్వహించలేక ఇబంది పడుతున్న వ్యాపారులకు 50,000వేల రూపాయలు వడ్డీలేని రుణాలను అందించారు గోళ్ళ రాజేష్ వ్యాపారస్తులు తమపై నమ్మకంతో వడ్డీలేని రుణాలు మంజూరు చేసిన గోళ్ళ రాజేష్ కీ వ్యాపారులు కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు.అదేవిధంగా కౌలు రైతులను కూడా వారిలో ఆత్మవిశ్వాసం పెరుగేందుకు కౌలు రైతులకు అండగా నిలిచారు మరొకసారి కౌలు రైతులకు ఆర్థిక సహకారం అందించేందుకు ముందుకు వచ్చారు గోళ్ళ రాజేష్ కావున నంద్యాల నియోజకవర్గ కౌలు రైతులందరూ కూడా గోళ్ళ రాజేష్ కార్యాలయంలో తమ పేరు నమోదు చేసుకోవాల్సిందిగా కోర డమైనది

# శ్రీశైలం జలాశయానికి తగ్గుముఖం పట్టిన వరద ప్రవాహం



**నంద్యాల శ్రీశైలం:ఆగస్టు=09 ప్రజాజ్యోతి** శ్రీశైలం జలాశయానికి తగ్గుముఖం పట్టిన వరద ప్రవాహం ఇన్‌ఫ్లో 36,233 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 'నిల్' పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు.. ప్రస్తుత నీటిమట్టం 878.20 అడుగులు. పూర్తిస్థాయి నీటి నిల్వ 215.80 టీఎంసీలు, ప్రస్తుత నీటి నిల్వ 178 టీఎంసీలు.రెండు జల విద్యుత్ కేంద్రాల ద్వారా 38,369 క్యూసెక్కులు సాగర్ కు విడుదల

# నేడు వివిధ కార్యక్రామాలను ప్రారంబించనున్న మంత్రి బీసీ జనార్ధన రెడ్డి



**కోవెలకుంట్ల:ఆగస్టు=09 ప్రజాజ్యోతి** నేడు సోమవారం సాయంత్రం 4 గంటలకు శాసనసభ్యులు మరియు మంత్రి వర్యులు బీసీ జనార్ధనరెడ్డి కోయిలకుంట్ల గ్రామంలోని వివిధ కాలనీలలో అభివృద్ధి కార్యక్రమముల ను ప్రారంభిస్తారు. అందులో భాగంగా కోయిలకుంట్లలోని సంతపేటలో వేసిన సిసీ రోడ్డును ప్రారంభిస్తారు. అక్కడే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. కావున కోయిలకుంట్లలోని సచివాలయం గ్రామపంచాయతి సి బ్బంది అందరు తప్పకుండ హాజరు కావాలని కోరడమైనది. అదే విధంగా మండ లంలోని మండల స్థాయి అధికారులు ఆశా అంగన్వాడీ కార్యకర్తలు మొత్తం సిబ్బంది, ప్రజలు పాల్గొనవలసిందిగా ఆయన పిలుపునిచ్చారు?

# విందు కార్యక్రమానికి హాజరైన కాటసాని రామిరెడ్డి



**బనగానపల్లె:ఆగస్టు=09 ప్రజాజ్యోతి** బనగానపల్లె మండలం పలుకూరు గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ బిసి నాయకుడు తెలుగు బాలుడు బనగానపల్లె మండలం కైప గ్రామం బ్రిడ్జి తిమ్మయ్య స్వామి వారి మొక్కుబడి సందర్భంగా విందు కార్యక్రమానికి హాజరు అయిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ,నియోజకవర్గ వైఎస్సార్సీపీ నాయకులు కాటసాని ప్రసాద్ రెడ్డి అవుకు మండల వైఎస్సార్సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి ,యస్ వి ఆర్ విద్యా సంస్థల చైర్మన్ శనివారపు వెంకటరామిరెడ్డి ,జిల్లా వైఎస్సార్సీపీ యువజన విభాగం అధ్యక్షుడు గుండం నాగేశ్వర్ రెడ్డి పాల్గోన్నారు

# గ్రామాల్లో కనిపించని...స్వచ్ఛ రథం...?




**దువ్వూరు,ఆగస్టు09 ( ప్రజా జ్యోతి )** గ్రామాల్లో స్వచ్ఛతకు పెద్దపీట వేసే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం స్వచ్ఛ పేరుతో వాహనాలను ఏర్పాటు చేసింది. జనవరి 24 వ తేదీన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ స్వచ్ఛ రథాన్ని ప్రారంభించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ స్వచ్ఛ రథం.స్వచ్ఛ రథం మాత్రం సంచారం చుట్టపుచూపుగా మారింది. కనీసం ఈ వాహనం వస్తున్నట్లు గ్రామాల్లో దండోరా వేసే కార్యక్రమాలు కూడా లేవు. ఫలితంగా ప్రజలకు అవగాహన లేకుండా పోయింది. క్షేత్రస్థాయిలో పంచాయతీరాజ్ అధికారుల, సిబ్బంది పర్యవేక్షణ చేయడం లేదు. వాహనాలను అట్టహాసంగా ప్రారంభించినా. అవి ఎక్కడ తిరుగుతున్నాయో ప్రత్యేకంగా దృష్టి సారించిన దాఖలాలు లేవు. స్వచ్ఛ రథం ఎప్పుడు గ్రామాలోకి వస్తుందో,గ్రామ సచివాలయాల్లో నోటీస్ బోర్డులో సమయ సూచికలు తెలిసేలా ఏర్పాటు చేయాలనీ ప్రజలు కోరుతున్నారు.

## రేషన్ షాపులపై...కొరవడిన అధికారుల పర్యవేక్షణ..!



**దువ్వూరు,ఆగస్టు09 (ప్రజా జ్యోతి )** మండలంలో రేషన్ షాపులపై అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. దీంతో ఎలాంటి భయం లేకుండా వినియోగదారుల నుంచి డీలర్లు బియ్యం కొనుగోలు చేస్తున్నారంటే అక్రమాల తీవ్రతను ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.ఇలా ప్రతి రేషన్ షాప్ లో అక్రమాలు జరుగుతున్నట్లు సమాచారం.మండలంలో సుమారు 37 షాపులు ఉన్నాయి. తెల్ల రేషన్ కార్డు ఉన్నప్పటికీ గ్రామాల్లో రైతు వారిగా కొంతమంది రేషన్ బియ్యం తీసుకోవడం లేదు. ఇలా ప్రతి గ్రామంలో రేషన్ తీసుకొని లబ్దిదారులు 20 నుంచి 25 శాతం మంది ఉన్నారు.వారి నుంచి ప్రతినెల బియ్యం కొనుగోలు చేస్తూ డీలర్లు అక్రమాలకు పాల్పడుతున్నారు. సివిల్ సప్లై శాఖ నిబంధనల ప్రకారం రేషన్ డీలర్లు వ్యాపారం చేయకూడదు.చట్ట వ్యతిరేకంగా వినియోగ దారుల నుంచి బియ్యాన్ని కొనుగోలు చేస్తూ అక్రమానికి పాల్పడుతున్నారు. అధికారులు ఆకస్మికంగా రేషన్ షాలపై తనిఖీలు చేస్తే అక్రమాలు బయటపడతాయి. ప్రస్తుతం డీలర్లు వినియోగదారుల దగ్గర కొనుగోలు చేసిన బియ్యం షాపులోనే ఉన్నట్లు సమాచారం.ఇదిలా ఉంటే కొన్ని రేషన్ షాపులలో కాటపై డబ్బా పెట్టి రేషన్ బియ్యం ఇస్తున్నట్లు వినికిడి.అధికారులు చిత్తశుద్ధితో తనిఖీలు నిర్వహించి అక్రమాల అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## మంత్రివర్యులు బీసీ జనార్దన్ రెడ్డి గారి పర్యటన వివరాలు



**బనగానపల్లె:ఆగస్టు=09** ప్రజాజ్యోతి నేడు సాయంత్రం 4:30 గంటలకు, కోయిలకుంట్ల పట్టణం నందు గౌరవ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి గారి ఆధ్వర్యంలో "ఇంటింటికీ తెలుగుదేశం, రెండేళ్ల నమ్మకం అభివృద్ధి-సంక్షేమం" కార్యక్రమంలో పాల్గొననున్నారు. అనంతరం పట్టణంలోని పలు కాలనీల్లో నూతనంగా నిర్మించిన పలు సీసీ రోడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమములో పాల్గొనను న్నారు. కావున, ఈ కార్యక్రమానికి ఎన్ డి ఏ కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు మరియు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మనవి చేస్తున్నాము.

## క్విట్ ఇండియా స్ఫూర్తితో - జైల్ బరో కార్యక్రమం లో భాగంగా ధర్నా మరియు రాస్తారోకో - కార్మిక సంఘాలు సి ఐటియు, ఐఎఫ్ టి యు ఎఐటియుసి

**కోవెలకుంట్ల:ఆగస్టు=09ప్రజాజ్యోతి**నేడు అనగ 10.08.2026 వ తేదీ ఉదయం సుమారు 10.00 గంటలకు సిపి ఎం పార్టీ నంద్యాల జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు సుధాకర్ ఆధ్వర్యంలో సుమారు 40 మంది కలిసి, నేడు అనగా ఆగస్టు 10వ తేదీ క్విట్ ఇండియా స్ఫూర్తితో- జైల్ బరో కార్యక్రమాన్ని పైన తెలిపిన వామపక్ష పార్టీల కార్మిక సంఘాలు, కోవెలకుంట్ల పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద నుండి గ్రామపంచాయతీ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, సీ ఐ సర్కిల్ వద్ద ధర్నా మరియు రాస్తారోకో నిర్వహించి నిరసన తెలియజేస్తాంఅని,సిపి ఎం సుధాకర్ తెలియజెశారు

**డిమాండ్స్**

1.వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్న మోడీ ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించాలి,
2.కనీసం మద్దతు ధరల చట్టం చేయాలి,
3.పాత ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్దించాలని, రోజు వేతనం 600 రూపాయల కు, పని దినాలు ఏడాదికి 200 రోజులకు పెంచాలి,
4.లేబర్ కోడ్లు రద్దుచేసి, కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలి,
5.కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి ప్రభుత్వము బ్యాంకు రుణాలు మంజూరు చేయాలి మొదలైనవి వారి డిమాండ్లు, అమలు చెయాలి

## ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న తెదేపా నాయకులు



**హిందూపురం :ప్రజా జ్యోతి న్యూస్: ఆగస్టు 09: శ్రీ సత్య సాయి జిల్లా బ్యూరో అంజి:** హిందూపురం శాసన సభ్యులు పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు హిందూపురం రూరల్ మండలంలోని కోటిపి పూలకుంట పంచాయతీ నందు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించడం జరిగింది. అనంతరం ప్రతి ఇంటి ఇంటికి వెళ్ళి ఈ ఏడాది పరిపాలనలో కూటమి ప్రభుత్వం అందించిన పథకాల గురించి వివరిస్తూ ఇది మంచి ప్రభుత్వం అని ప్రజలందరూ జే జే లు పలికినారు ఈ కార్యక్రమంలో హిందూపురం టీడీపీ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు హిందూ పురం మండలం టీడీపీ కన్వీనర్ హెచ్ ఎన్ రాము మార్కెట్ యార్డ్ చైర్మన్ అశ్వతనారాయణ రెడ్డి ఆదినారాయణ ప్రదీప్ అరుణాచల రెడ్డి ఉమశంకర్ రెడ్డి మంజునాథ్ రామకృష్ణ రెడ్డి శ్రీరాములు, చెకిరప్ప, హనుమంత్ రాయడు ఐటీడీపి రామాంజి తెలుగుయువత రామకృష్ణ అంజి గోపాల్ రెడ్డి సూరి మరియు టీడీపీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయడం జరిగింది

# కిస్తారంలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

**గిరిజనులకు నిత్యావసరాలు, క్రీడా పరికరాలు పంపిణీ చేసిన 212 బెటాలియన్ సీఆర్పీఎఫ్**

**గిరిజనులను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడమే ధ్యేయం**

**కమాండెంట్ విజయ్ కుమార్ వర్మ**

**ఎటపాక, ఆగస్టు 9 (ప్రజాజ్యోతి):**ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, సుకుమ జిల్లా, కొంట మండలం కిస్తారం యాక్సిస్ (పోటక్‌పల్లి)లోని 212 బెటాలియన్ సీఆర్పీఎఫ్ క్యాంపు ప్రాంగణంలో ఆదివారం ఆదివాసీ దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ శ్రీ విజయ్ కుమార్ వర్మ నాయకత్వంలో స్థానిక గిరిజన సమాజం కోసం ప్రత్యేక ప్రజా సంక్షేమ కార్యక్రమాన్ని (సివిక్ యాక్షన్ ప్రోగ్రామ్) చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామస్తులకు వ్యవసాయ పరికరాలు, దుప్పట్లు, చీరలు, పాత్రలతో పాటు విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, స్టేషనరీ, యువతకు క్రీడా పరికరాలను సీఆర్పీఎఫ్ అధికారులు అందజేశారు. అనంతరం గ్రామస్తులకు ప్రత్యేక భోజన వసతి కల్పించారు. సీఆర్పీఎఫ్ అధికారులు, జవాన్లు స్థానిక ప్రజలతో ముఖాముఖిగా మమేకమై వారి సమస్యలను, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. తమకు సాధ్యమైనంత వరకు సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. గిరిజన సమాజంతో సత్సంబంధాలను నెలకొల్పడం, గౌరవం, పరస్పర సహకార భావాన్ని పెంపొందించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ మానవతా కార్యక్రమంపై స్థానిక గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తూ, సీఆర్పీఎఫ్ బలగాలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గిరిజనుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం, నక్సలైట్ కుట్రలను తిప్పికొట్టి, వారికి గట్టి దెబ్బ కొట్టిన అనంతరం గిరిజన ప్రాంతాల్లో శాంతిభద్రతలను నెలకొల్పుతూ, స్థానిక గిరిజనులను సమాజంలో ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడమే 212 బెటాలియన్ ముఖ్య లక్ష్యమని కమాండెంట్ శ్రీ విజయ్ కుమార్ వర్మ స్పష్టం చేశారు. సమాజంలోని బలహీన, నిరుపేద వర్గాల సంక్షేమం కోసం భవిష్యత్తులోనూ ఇటువంటి సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సెకండ్ ఇన్ కమాండ్ ఆఫీసర్ (అడ్మినిస్ట్రేషన్) శ్రీ షమీముద్దీన్ షేక్, సెకండ్ ఇన్ కమాండ్ ఆఫీసర్ (ఆపరేషన్స్) శ్రీ దినేష్ కుమార్, డిప్యూటీ కమాండెంట్ శ్రీ గౌరవ్ శర్మ, అసిస్టెంట్ కమాండెంట్ శ్రీ రాకేష్ లాంబా, ఇతర అధికారులు, సీఆర్పీఎఫ్ జవాన్లు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక గిరిజనులు పాల్గొన్నారు.




ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరిజన చిన్నారులకు పాఠశాల బ్యాగులు, స్టేషనరీ పంపిణీ చేస్తున్న సీఆర్పీఎఫ్ అధికారులు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.




సుకుమా జిల్లాలోని కిస్తారం సీఆర్పీఎఫ్ 212 బెటాలియన్ క్యాంపులో ఆదివాసీ దినోత్సవ వేడుకల సందర్భంగా గిరిజనులకు నిత్యావసరాలు, క్రీడా పరికరాలు పంపిణీ చేసిన అనంతరం వారితో కలిసి ఫోటో దిగిన సీఆర్పీఎఫ్ అధికారులు.




ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరిజన మహిళలకు నిత్యావసర వస్తువులను అందజేస్తున్న సీఆర్పీఎఫ్ 212 బెటాలియన్ కమాండెంట్ విజయ్ కుమార్ వర్మ.

# కే.ఆర్. పురం ఐటీడీఏలో ఘనంగా ఆదివాసీ దినోత్సవ వేడుకలు

**- ముఖ్య అతిథిగా పాల్గొన్న పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు**

**కే,ఆర్ పురం : 09 ఆగస్ట్ కే, ఆర్ పురం : ప్రజాజ్యోతి రిపోర్టర్ (శివరామ్ )** కే.ఆర్. పురం ఐటీడీఏలో ఆదివారం ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాలు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ముందుగా ఆదివాసీ ఆచార సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా ఎమ్మెల్యే భాణం ఎక్కి కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆదివాసీ నాయకపోడు కుల దైవాలకు కొబ్బరికాయ కొట్టి, కొర్రాజుల విగ్రహాన్ని ఎత్తుకున్నారు. ఆదివాసీ కళాకారులతో కలిసి అడుగులు వేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు.అనంతరం కార్యక్రమ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరం, రక్తదాన శిబిరాలను ఎమ్మెల్యే సందర్శించారు. వివిధ శాఖలు, సంస్థలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. సభా ప్రాంగణానికి చేరుకున్న అనంతరం ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. ఆదివాసీ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వక్తలు చేసిన ప్రసంగాలు, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలతో సభా ప్రాంగణం ఉత్సాహభరితంగా మారింది. కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజును శాలువాతో ఘనంగా సత్కరించారు.ఆదివాసీల హక్కుల సాధనకు ఎల్లప్పుడూ ముందుంటానన్నారు ఎమ్మెల్యే చిర్రి బాలరాజుఅనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ.. ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమం, వారి హక్కుల సాధన కోసం తాను ఎల్లప్పుడూ ముందుంటానని అన్నారు. ఆదివాసీ సమాజం అభివృద్ధి చెందితేనే ప్రాంతం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.ఆదివాసీలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తానని తెలిపారు. విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు.ఆదివాసీ యువత విద్య, ఉద్యోగ రంగాల్లో ముందుకు రావాలని, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదవాలని ఎమ్మెల్యే సూచించారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, కళలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ఆదివాసీ ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని, పోలవరం నియోజకవర్గంలోని ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి తన వంతు కృషి నిరంతరం కొనసాగుతుందని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో రాముల నాయక్, ట్రైకర్ చైర్మన్ బోరగం శ్రీనివాస్, ఎస్టీ కమిషన్ కాకి లక్ష్మి,శాప్ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి,మార్కెట్ కమిటీ చెర్మన్ పొట్ట రామారావు,బీజేపీ ఎస్టీ మోర్చా నాయకులు వంకా కాంచనమాల, బోరగం వెంకటలక్ష్మి,మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు, కూటమి నాయకులు బండారు అనిల్, పూనెం రాజా, కుంజా రమేష్, నెలటూరి మోహన్, కాల్నిడి రాంబాబు, బండారు సత్యనారాయణ, గణేష్ స్వామి,అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆదివాసీ సంఘాల నాయకులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, కళాకారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మోదీ....నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చెయ్యి లేదా ఈ నెల 10 న మమ్మల్ని జైల్లో పెట్టు




**క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తి తో మోడీని గద్దె నుండి దింపుదాం**

**ఏఐటియుసి బనగానపల్లె నియోజకవర్గ ముఖ్యుల సమావేశంలో మాట్లాడుతున్న నంద్యాల జిల్లా ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ డి శివ బాలకృష్ణ?**

**కార్మిక,కర్షక,రైతాంగ సమస్యలు పరిష్కరించాలని, ఈనెల 10వ తేదీన జైల్ బరో**

**అవుట్ సోర్సింగ్ కార్మికులకు 31 వేలు జీతం ఇవ్వాలి**

**నంద్యాల:ఆగస్టు=09 ప్రజాజ్యోతి** వ్యవసాయ,ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 10 న తలపెట్టిన జైల్ బరో కార్యక్రమన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ సిఐటియ తదితర కేంద్ర కార్మిక రైతు ప్రజా సంఘాల ఆధ్వర్యం లో నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం స్థానిక బనగానపల్లి ఏఐటీయూసీ కార్యాలయంలో ఏఐటీయూసీ ముఖ్యుల సమావేశం నిర్వహించారు బాలకృష్ణ మాట్లాడుతూ ఈ నెల 10న క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి నియోజకవర్గంలోని కార్మికులు కర్షకులు అందరి ఏకమై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేదవతి బనగానపల్లె నియోజకవర్గం రవి కొత్తూరు సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు

## మలుపు ఉందని... తెలిసేదేలా..!



**దువ్వూరు,ఆగస్టు09 (ప్రజా జ్యోతి )** దువ్వూరు టు ప్రొద్దుటూరు పోయే మార్గమధ్యలో కొన్ని చోట్ల మలుపు ఉన్న చోట మరియు రహదారి సూచిక బోర్డులు లేకపోవడం వలన వాహనదారులకు చాలా ఇబ్బందికరంగా మారింది. గతంలో పలు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. దువ్వూరు సమీపంలో ఒక మలుపు,రాధానగర్ సమీపంలో సూచిక బోర్డు ఒరిగి దర్శనమిస్తుంది.కామనూరు వంతెన సమీపంలో మరో మలుపు ఉంది.ఇక్కడే ఈ మధ్య కాలంలోనే కారు, ద్విచక్ర వాహనం ఢీ కొన్నాయి. మొత్తానికి దువ్వూరు టు ప్రొద్దుటూరు పొయే మార్గమధ్యలో ఆర్ అండ్ బి అధికారు లు గమనించి,అవసరం ఉన్న చోట రహదారి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలనీ ప్రజలు, వాహన దారులు కోరుతున్నారు.

# పేద,మధ్య తరగతి వర్గాల ప్రజలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి




**- సి.ఏం.ఆర్. ఎఫ్ చెక్కుల ద్వారా వేలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా**

**- లబ్దిదారులకు సి.ఎం.ఆర్.ఎఫ్ చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి కూన ప్రమీల**

**పొందూరు, ప్రజాజ్యోతి న్యూస్:** ముఖ్యమంత్రి సహాయ నిధి పేద , మధ్య తరగతి వర్గాల ప్రజలకు అండగా నిలుస్తోందని ఆమదాలవలస ఎమ్మెల్యే రాష్ట్ర పి.యూ.సి చైర్మెన్ కూన రవికుమార్ సతీమణి ,మాజీ ఎంపీపీ కూన ప్రమీల అన్నారు. పొందూరు మండలం కింతలి గ్రామంలో పలువురు లబ్దిదారుల కు ఆమె స్వయంగా వెళ్లి సి.ఎం.ఆర్.ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో భరోసా కల్పిస్తుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల సంక్షేమం ఆరోగ్యం ,సామాజిక భద్రతకు ప్రాధాన్యతని స్తూ అనేక కార్యక్ర మాలను అమలు చేస్తుందని తెలిపారు. ప్రజలకు ఏ కష్టం వచ్చిన ప్రభుత్వం అండగా ఉంటుందని ,అర్హులైన ప్రతీ ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయ నిధిఅందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలో ఎమ్మెల్యే కూన రవి కుమార్ నాయకత్వంలో ఎంతో మందికి సి.ఎం.ఆర్.ఎఫ్ చెక్కులను మంజూరు చేయడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి సీపాన శ్రీరంగ నాయకులు, కింతలి గ్రామ మాజీ సర్పంచ్ పైడి రామ్ ప్రసాద్ ఎంపీటీసీ కూటికుప్పల హనుమంతు రావు మాజీ సర్పంచ్ దవళ గణపతి రావు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# ఎటపాక మండల సమస్యలను పరిష్కరించాలి

**ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి వినతిపత్రం సమర్పించిన తోటకూరి శ్రీనివాసరావు, తోటకూరి కృష్ణ సంజీవ్ చౌదరి**

**సానుకూలంగా స్పందించిన సీఎం**


సీఎం చంద్రబాబు నాయుడుకు సమస్యలను వివరిస్తున్న తోటకూరి కృష్ణ సంజీవ్


సీఎం చంద్రబాబు నాయుడుకు సమస్యలను వివరిస్తున్న తోటకూరి శ్రీనివాసరావు

**ఎటపాక, ఆగస్టు 9 (ప్రజాజ్యోతి):** పోలవరం జిల్లా ఎటపాక మండలంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ తోటకూరి శ్రీనివాసరావు, తోటకూరి కృష్ణ సంజీవ్ చౌదరి శనివారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎటపాక మండల ప్రజలు ఎదుర్కొంటున్న పలు ప్రధాన సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మండలంలోని పెండింగ్ రెవెన్యూ సమస్యలను పరిష్కరించి రైతులు, ప్రజలకు ఉపశమనం కల్పించాలని కోరారు. ప్రస్తుతం మండలంలో మూడు ఆర్టీసీ బస్సులు మాత్రమే నడుస్తున్నందున ప్రజల రవాణా అవసరాల దృష్ట్యా మరో మూడు బస్సులను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి చెందిన ఎటపాక పరిధిలోని భూములు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, ఇళ్లు లేని ఎస్సీ, ఎస్టీ నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. విద్యుత్ సరఫరా సమస్యల పరిష్కారానికి 11 కేవీ విద్యుత్ లైన్‌తో కూడిన నూతన సబ్‌స్టేషన్‌ను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఎటపాక మండల కేంద్రంలో పూర్తిస్థాయి సౌకర్యాలతో ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని, పోస్టుమార్టం సదుపాయం కల్పించాలని కోరారు. అత్యవసర సమయాల్లో ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించేందుకు మండల కేంద్రంలో ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పోలవరం బ్యాక్‌వాటర్ కారణంగా ముంపునకు గురయ్యే గ్రామాలను 41.15 కాంటూర్ పరిధిలోకి చేర్చి, వరద ముప్పు నుంచి ప్రజలను రక్షించాలని కోరారు. ముంపు బాధితులకు తగిన పరిహారం, పునరావాసం కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. తాము అందించిన వినతిపత్రంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. ఎటపాక మండల సమస్యలను పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు తోటకూరి శ్రీనివాసరావు, తోటకూరి కృష్ణ సంజీవ్ చౌదరి తెలిపారు.

# గోదావరి ముంపు ప్రాంతాల్లో పర్యటించిన చైల్డ్ రైట్స్ కమిషన్!..

**బాలలకువిద్య,వైద్యం,పౌష్టికాహారం గురించి!.. ఆరాతీసిన,ఏ.పీ.ఎస్సీ.పీ.సీ.ఆర్,సభ్యులు!..**

**పేరంటాలపల్లిలో కొండరెడ్ల కుటుంబాలతోమాటామంతీ!..**

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కులరక్షణ కమీషన్ సభ్యులు ఉండవల్లి గాంధీబాబు!..**




**వి.ఆర్.పురం,ఆగష్టు9(ప్రజాజ్యోతి ప్రతినిధి)** ఇటీవల అకస్మాత్తుగా గోదావరికి,వచ్చిన వరదలతోముంపునకు గురైన పోలవరం,జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ బాలల హక్కులపరిరక్షణ కమిషన్ సభ్యుల బృందం ఆదివారం, పర్యటించి,పేరంటాపల్లి,తోపాటు ఆప్రాంతాల్లో కొండరెడ్డి ఏజెన్సీగూడేలను ఏ.పీ.ఎస్సీ.పీ.సీ.ఆర్,సభ్యులు ఉండవల్లి గాంధీబాబు,డాక్టర్ ధోని శ్రీనివాసమూర్తి,చల్ల మధు సూదన రావు,సందర్శించారు.ఈసందర్భంగా,వారు పిల్లలు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. టీకాలు వేయించారా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. అంగన్ వాడీ కేంద్రంనుంచి పిల్లలకు పాలు, గుడ్లు, బాలామృతం,చిక్కీ పంపిణీపై ఆరాతీశారు. పిల్లలను క్రమం తప్పకుండా, బడికి పంపించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ బడి మానిపించవద్దని కోరారు.తల్లికి వందనం పథకంఅందిందాని అడగ్గా, అందరికీతల్లికి వందనం డబ్బులు పడ్డాయని తల్లులు తెలిపారు. ఆశ కార్యకర్తతోనూ మాట్లాడి గ్రామంలో పిల్లలపరిస్థితి అడిగితెలుసుకున్నారు.ఆయా గ్రామాలపెద్దలతో మాట్లాడిన సభ్యులు పిల్లలనుచదువు మానిపించిపనిలో పెట్టడంనేరమని,అలాగే బాల్య వివాహాలు చేసినా చట్ట ప్రకారం చర్యలుంటాయని హెచ్చరించారు. విద్యతోనే ఆదివాసీల అభ్యున్నతి సాధ్యమని, పిల్లల ఉన్నత చదువులు పూర్తి చేస్తే,వారే మీ జీవితాలకు వెలుగు దివ్వెలు అవుతారని ఆదివాసీలకు సూచించారు.ఈపర్యటన కార్యక్రమంలో గ్రామస్తులు, సంబంధిత గ్రామాల ప్రజలు తదితరులు హాజరయ్యారు.

## డీఎస్సీ పై వైసీపీ నేతల విమర్శలు సరికాదు-టీడీపీ మండల అధ్యక్షులు ఖాసింవలి



**నందవరం, ఆగస్టు 8(ప్రజాజ్యోతి ):**మెగా డీఎస్సీ ద్వారా యువతకు ఉద్యోగాలు లభిస్తుంటే వైసీపీ నేతలు విమర్శలు చేయడం సరికాదని టీడీపీ నందవరం మండల కన్వీనర్ ఖాసింవలి అన్నారు. మాచాపురం స్వగృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ప్రతిభతో ఉద్యోగాలు సాధించిన యువతను అభినందించడాన్ని కూడా రాజకీయంగా చూడటం వైసీపీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు.కూటమి ప్రభుత్వం యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ, విద్యారంగాన్ని బలోపేతం చేసి నిరుద్యోగుల్లో నమ్మకం పెంచేందుకు కృషి చేస్తోందన్నారు. యువత విజయాలను రాజకీయాలకు లాగకుండా ప్రజా సమస్యలపై రాజకీయాలు చేయాలని వైసీపీ నేతలకు సూచించారు.

## రేపు డీఎస్సీ అక్రమాలపై ఉరవకొండ నియోజకవర్గ కేంద్రంలో భారీ నిరసన ర్యాలీ

**ప్రజా జ్యోతి జిల్లా బ్యూరో సుబ్బు**




ఉదయం 9:00 గంటలకు ఉరవ కొండ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే వై విశ్వేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో డీఎస్సీ అక్రమాలపై ఉరవకొండ పంచాయితీ కార్యాలయం నుంచి భారీ నిరసన వ్యాలీ ఏర్పాటు చేయడం జరిగింది. ముందుగా డీఎస్సీ పై సిబిఐ ఎంక్వయిరీ జర గాలి దానితోపాటు కోట్లల్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి ఈ ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గాలను ప్రశ్నించడానికి రండి కదలి రండి. కావున ఉరవ కొండ నియోజక వర్గం వైయస్సార్సీపి నాయకులు కార్యకర్తలు ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజాప్రతినిధులు అనుబంధ సంఘాల అధ్యక్షులు కమిటీ మెంబర్లు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డి విలేకరులకు తెలియజేశారు.

## ఎమ్మెల్యే శ్రీమతి భూమా అఖిల ప్రియ గారి ఆశీస్సులతో మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో నిర్వహించిన రెండురోజుల యూనిట్ ఇన్‌చార్జిల శిక్షణ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం లభించడం ఎంతో ఆనందంగా ఉంది



**నంద్యాల ఆళ్లగడ్డ: ఆగస్టు= 09 ప్రజాజ్యోతి** ఈ శిక్షణలో ముఖ్యంగా క్రింది అంశాల పై సమగ్ర అవగాహన కల్పించారు: పార్టీ భావజాలం చరిత్ర టెక్నాలజీ వినియోగం మరియు పార్టీ అప్లికేషన్లు యూనిట్ ఇన్ చార్జ్ బాధ్యతలు, పాత్రలు కర్తవ్యాలు పోల్ మేనేజ్ మెంట్ మరియు ఎలక్షనీరింగ్ అదేవిధంగా ప్రజలతో నిరంతరం మమేకమై ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేర్చడం, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, రాబోయే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా క్రమశిక్షణతో, సమన్వయంతో పనిచేయాలని పార్టీ నాయకత్వం దిశానిర్దేశం చేసింది.ఈ విలువైన శిక్షణ కార్యక్రమం పార్టీ పట్ల నా బాధ్యతను మరింత పెంపొందించడంతో పాటు, ప్రజాసేవ పట్ల మరింత అంకితభావంతో పనిచేయాలనే స్ఫూర్తిని అందించింది.ముఖ్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారితో కాఫీ కబుర్లు అనే కార్యక్రమంలో ఆయన ఇచ్చిన సందేశం ఎంతో స్ఫూర్తిని ఇచ్చింది, కార్యకర్తను నుండి నాయకుడు గా తీర్చాలనే ఉదేశ్యం జీవితంలో మర్చిపోని ఒక మరుపురాని సంఘటన.

## గరుగుబిల్లి పంచాయతీ గిరిజన గ్రామాలలోఇంటింటి ప్రచార కార్యక్రమం.



**అనంతగిరి మండలం. ఆగస్టు 9. ప్రజా జ్యోతి న్యూస్.రిపోర్టర్ శంకర్.** అల్లూరి సీతారామ రాజు జిల్లా. అనంతగిరి మండలం. గరుగుబిల్లి పంచాయితీ గిరిజన గ్రామాలలో ఆదివారం నాడు తెలుగుదేశం పార్టీ నాయకుడు ఇంటి సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం రెండేళ్లు పాలనలో చేపట్టిన అభివృద్ధి. మంజూరు చేసిన పథకాలు యొక్క వివరాలను తెలుగుదేశం పార్టీ నాయకుడు సూర్యనారాయణ స్వయంగా గిరిజన మహిళలను కలిసి పథకాల యొక్క విలువలను వివరించారు. అర్హులైన లబ్ధిదారులకు పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదని అడిగి తెలుసుకున్నారు. కూటమిప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు. తల్లికి వందనం. దీపం. ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలుఅందుతున్నాయని మహిళలు సమాధానం ఇచ్చారని నాయకుడు సూర్యనారాయణ ఆదివారం నాడు ప్రజా జ్యోతి దినపత్రికకు సమాచారం అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక స్థానిక గిరిజన మహిళలు. పార్టీ కార్యకర్తలు. పార్టీ నాయకులు ఇంటి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు

# ఆదివాసి హక్కులు, చట్టాల పరిరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలి






**-- ఆదివాసి అఖిలపక్షం డిమాండ్**

**కూనవరం: ఆగస్టు 9, ప్రజా జ్యోతి** ఆదివాసుల హక్కులు, రాజ్యాంగపరమైన చట్టాల పరిరక్షణకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని ఆదివాసి అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా బ్రిడ్జి సెంటర్ నుంచి ఉదయ భాస్కర్ థియేటర్ వరకు ఆదివాసి సంఘాల నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సభా ప్రాంగణానికి చేరుకుని బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘాల నాయకులు మాట్లాడుతూ షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఆదివాసుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలను పటిష్టంగా అమలు చేయడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని కోరారు. జీవో నెంబర్ 3 పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలి: 2022--23 సంవత్సరాల్లో జీవో నెంబర్ 3 రద్దయినప్పటికీ, ఇప్పటివరకు ప్రభుత్వం తరపున ఇంప్లీడ్ పిటిషన్ ఎందుకు దాఖలు చేయలేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 3 పునరుద్ధరణ కోసం ప్రభుత్వం తక్షణమే న్యాయపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జీవో నెంబర్ 3 స్థానంలో చట్టబద్ధమైన ప్రత్యామ్నాయ ఉత్తర్వులు తీసుకు రావాలని అన్నారు. 1/70 చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి ఆదివాసుల భూములకు రక్షణ కల్పించేందుకు 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఆదివాసుల భూములు అన్యాక్రాంతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామసభల అనుమతి లేకుండా ప్రాజెక్టులు చేపట్టవద్దు: ఏజెన్సీ ప్రాంతాల్లో చట్టాలకు పూర్తిస్థాయి రక్షణ ఉంటే షెడ్యూల్డ్ ప్రాంతాల్లో భూగనుల తవ్వకాలు, హైడ్రో ప్రాజెక్టులు తదితరాలకు ప్రభుత్వం ఎందుకు అనుమతులు ఇస్తోందని ప్రశ్నించారు. ఆదివాసుల హక్కులు, గ్రామసభల అధికారాలను పరిగణనలోకి తీసుకోకుండా ఎలాంటి ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఆదివాసుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, హక్కులు మరియు చట్టాల పరిరక్షణ విషయంలో నిర్లక్ష్యం కొనసాగిస్తే భవిష్యత్తులో భారీ ఎత్తున ఉద్యమాలు చేపడతామని ఆదివాసి అఖిలపక్షం నాయకులు హెచ్చరించారు. ఆదివాసులందరూ ఐక్యంగా ముందుకు వచ్చి హక్కుల పరిరక్షణ కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాయం రంగమ్మ, జడ్పిటిసి గుజ్జ విజయ, బాబు బొర్రయ్య పులి సంతోష్, లాయర్ రవితేజ, తెల్లం తమ్మయ్య, గుజ్జా బాబు, నాగమణి అమ్మాజీ, జయసుధ,సత్యనారాయణ, బొగ్గా రామారావు, కరక రాజకుమార్, బొగ్గా వెంకమ్మ సున్నం అభిరామ్ కారం కన్నారావు, మడెం బాబు, సొందె వినోద్, వెట్టి వినోద్ తదితరులు పాల్గొన్నారు

# డోన్‌లో ఘనంగా బైబిల్ మిషన్ తైలాభిషేక పండుగ



**డోన్ ( ప్రజా జ్యోతి )ఆగస్టు 9** నంద్యాల జిల్లా డోన్ పట్టణంలోని వైఎస్ఆర్ నగర్,బందెల రాజు ఆధ్వర్యంలో బైబిల్ మిషన్ గుంటూరు హెడ్ ఆఫీస్ ఆధ్వర్యంలో రాయలసీమ ప్రాంతీయ బైబిల్ మిషన్ తైలాభిషేక పండుగను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి నంద్యాల,డోన్,ప్యాపిలి, అనంతపురం,ఎర్రగుడి తదితర ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు హాజరయ్యారు.బైబిల్ మిషన్ ద్వారా నిర్వహించిన ఈ తైలాభిషేక కార్యక్రమంలో దైవ సేవకులు భక్తులకు అభిషేక తైలంతో ప్రార్థనలు నిర్వహించారు.దేవుని ఆశీస్సులతో భక్తులకు నూతన శక్తి, ఆరోగ్యం,మేలు,ఆయుష్షు కలగాలని ప్రార్థనలు చేశారు.భక్తులు విశ్వాసంతో తైలాభిషేకం పొందారు.కార్యక్రమానికి ముఖ్య ఆహ్వానితుడిగా అనంతపురం జిల్లా పాస్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడురెడ్డినెహెమ్యా నాగరాజు సతీమణి కలిసి పాల్గొన్నారు.స్థానిక వైఎస్ఆర్ నగర్ బైబిల్ మిషన్ చర్చి సంఘ కాపరి రెవరెండ్ బందెల రాజు బైబిల్ మిషన్ ఏవో కార్యక్రమాన్ని నిర్వహించారు.తైలాభిషేక పండుగ సందర్భంగా భక్తులకు ఉచితంగా భోజనం ఏర్పాటు చేయడంతో పాటు నిరుపేదలకు నూతన వస్త్రాలను బహుమతిగా అందజేశారు.భక్తులకు ఆశీర్వాద భోజనం తైలాభిషేకం అందించి పంపించారు.సేవా కార్యక్రమాలతో కూడిన ఈ ఆధ్యాత్మిక పండుగ పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బ్రదర్ మణిరాజు,బైబిల్ మిషన్ సంఘ సభ్యులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రార్థనలు, తైలాభిషేకం, అన్నదానం, వస్త్రాల పంపిణీతో కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా ముగిసింది.అని కార్యనిర్వాహకుడు బందెల రాజు తెలిపారు,

# అభివృద్ధి,సంక్షేమమే లక్ష్యంగా కూటమి పాలన

**--హామీల అమలుతో ప్రజలకు చేరువగా టీడీపీ**

**--ఇంటింటికీ ప్రచారంలో తూము కుమార్,కుర్ల చినబాబు**



**కాకినాడ జిల్లా ఆగస్టు 09(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అభివృద్ధి,సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని టీడీపీ సీనియర్ నాయకుడు తూము కుమార్,కిర్లంపూడి సొసైటీ అధ్యక్షుడు కుర్ల చినబాబు పేర్కొన్నారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ,కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం కిర్లంపూడి మండలం రమణయ్యపేటలో ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తోందని వివరించారు.ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడమే లక్ష్యంగా ఇంటింటికీ టీడీపీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రజా సంక్షేమం,రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఆడారి లోవ,మద్దాల శివ,ఈగల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సీతాపురంలో మిన్నంటిన భక్తి పారవశ్యం

**మద్దిరామక్క ఆలయంలో వైభవంగా బోనాల పండగ**

**అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్న మహిళామణులు**

**పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు, గ్రామస్తులు**




**ఎటపాక, ఆగస్టు 9 (ప్రజాజ్యోతి):**పోలవరం జిల్లా ఎటపాక మండలం సీతాపురం గ్రామంలో వేంచేసియున్న శ్రీ మద్దిరామక్క అమ్మవారి ఆలయ ప్రాంగణం ఆదివారం భక్తి పారవశ్యంతో మురిసిపోయింది. శ్రావణ మాస మహోత్సవాల్లో భాగంగా గ్రామ దేవత మద్దిరామక్క అమ్మవారి బోనాల సంబరాలు కన్నుల పండువగా, రంగ రంగ వైభవంగా జరిగాయి. ఉదయం నుంచే గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా, ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో విలసిల్లాయి. ఈ సందర్భంగా గ్రామ మహిళలు ప్రత్యేకంగా అలంకరించిన బోనాల కుండలపై దీపాలు వెలిగించి, శిరస్సున ధరించి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా తరలివచ్చారు. దప్పుల వాయిద్యాలు, మేళతాళాల చప్పుళ్ళు, శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాల నడుమ ఊరేగింపు అత్యంత వైభవంగా సాగింది. "తల్లి మద్దిరామక్కా.. మమ్మల్ని చల్లగా చూడవమ్మా" అంటూ భక్తులు చేసిన నామస్మరణలతో సీతాపురం వీధులు మారుమోగాయి. అనంతరం ఆలయానికి చేరుకున్న మహిళలు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు, నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని, గ్రామంలోని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ బోనాల మహోత్సవంలో సీతాపురం గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు, పిల్లలు, యువకులు, పెద్దలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విచ్చేసిన భక్తులందరికీ తీర్థప్రసాదాలు, అన్నదానం పంపిణీ చేశారు. వేడుకలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి.

## ఎమ్మెల్యేను కలిసిన ప్రభాకర్ చౌదరి




**ప్రజా జ్యోతి జిల్లా బ్యూరో సుబ్బు** అనంతపురం జిల్లా పామిడి టిడిపి నాయకులు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కె. ప్రభాకర్ చౌదరి మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మరియు గుత్తి మరియు పామిడి ఇంచార్జ్ గుమ్మలూరు ఈశ్వర్ ని కలవడం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తో పామిడి మండల అభిరుద్ధి పనులు మరియు డోర్ టూ డోర్ కార్యక్రమం గురించి కె. ప్రభాకర్ చౌదరి చర్చిచడం జరిగినది. ఈ కార్యక్రమం లో టిడిపి నాయకులు పామిడి పట్టణ ఉపాధ్యక్షులు కె. బాబావలి మాజీ మైనారిటీ అధ్యక్షులు కె. హుసేన్ పీరా అప్పాజీపేట ప్రసాద్ పాల్గొనడం జరిగినది.

## పెద్దాపురం మరిడమ్మ జాతరకు పటిష్ట పోలీసు బందోబస్తు

ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్న పెద్దాపురం డీఎస్పీ తిలక్

**--సీఐ వైఆర్కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి..**



**కాకినాడ జిల్లా ఆగస్టు 09(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కాకినాడ జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టింది.జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు పెద్దాపురం డీఎస్పీ ఏబీజీ తిలక్ ప్రత్యక్ష పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.పెద్దాపురం ఇన్‌స్పెక్టర్ వైఆర్కె.శ్రీనివాస్‌తో పాటు ఎస్సైలు,పోలీసు సిబ్బంది జాతర ప్రాంతంలో నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారు.భక్తులు ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకునేలా క్యూ లైన్లు,ఆలయ పరిసరాలు,రద్దీ ప్రాంతాలు,పార్కింగ్ ప్రదేశాలు, ట్రాఫిక్‌ను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు.జాతరలో రద్దీని ఆసరాగా చేసుకుని దొంగతనాలు, గొలుసు దొంగతనాలు,జేబు దొంగతనాలు, ద్విచక్ర వాహనాల చోరీలకు అవకాశం ఉన్న నేపథ్యంలో భక్తులను అప్రమత్తం చేస్తున్నారు.మైక్‌లు, ఆడియో ప్రకటనల ద్వారా విలువైన వస్తువులు,మొబైల్ ఫోన్లు,నగలు,వాహనాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. అదేవిధంగా వృద్ధులు,చిన్నారుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ,ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారు. జాతరకు వచ్చే భక్తులు పోలీసులకు సహకరించి, సూచనలు పాటించాలని పోలీసు అధికారులు కోరారు.

## బ్రహ్మంగారి నివాస గృహ నిర్మాణానికి 1,00,302/- విరాళం



**బ్రహ్మంగారిమఠం -ప్రజా జ్యోతి ఆగస్టు 9** మండల కేంద్రంలోని పవిత్ర పుణ్యక్షేత్రం భవిష్యత్తు వర్తమాన కాలజ్ఞానం రచించిన జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి నివాస గృహము నిర్మాణానికి గాను కర్నూలు వాస్తవ్యులు కీర్తిశేషులు గుజరాతి వీర బ్రహ్మం జ్ఞాపకార్థం వారి కుమారుడు గుజరాతి అరుణ్ వీరి ధర్మపత్ని సాహితి మరియు గుజరాతి రాకేష్ వీరి ధర్మపత్ని సంజన రూ.1,00,302/-విరాళం బ్రహ్మంగారి మఠం సిబ్బందికి అందజేశారు.

## కాలం గడిచినా... బాల్య స్నేహం చెరిగిపోదు. దూరాలు పెరిగినా... ఆత్మీయత తగ్గదు

**1991--92 పదవ తరగతి పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక**




**గుంతకల్లు ఆగస్టు 8 (ప్రజా జ్యోతి):** ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ స్పిన్నింగ్ మిల్ హైస్కూల్‌లో ఆదివారం ఆగస్టు 9వ న 1991--92 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల అపూర్వ కలయి క కార్యక్రమం ఆత్మీయంగా జరిగింది. దాదాపు 35 సంవత్సరాల అనంతరం పూర్వ విద్యార్థులంతా ఒకే వేదికపై కలుసుకుని, తమ చిన్ననాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసు కున్నారు. అప్పటి స్నేహితు లను కలుసుకోవడంతో ప్రతి ఒక్కరిలోనూ ఆనందం వెల్లి విరిసింది. విద్యార్థి దశలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను స్మరించుకుంటూ వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ ప్రస్తుత జీవన విశేషాలను పరస్పరం పంచుకుని, భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆత్మీయ కలయికలను నిర్వహించు కోవాలని నిర్ణయించారు. ఎన్నో సంవత్సరాలు గడిచి నా తమ స్నేహబంధం చెక్కుచెదరలేదని, ఈ కలయిక మరచిపోలేని మధుర జ్ఞాపకంగా నిలిచిందని కాలం గడిచినా... బాల్య స్నేహం చెరిగిపోదు. దూరాలు పెరిగినా... ఆత్మీయత తగ్గదు." పూర్వ విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

## కార్యకర్తలతో ఎమ్మెల్యే ముచ్చట



**బాపట్ల ఆగస్టు 9 ( ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి )** బాపట్ల నియోజకవర్గ అభివృద్ధి పయనంలో కార్యకర్తల భాగస్వామ్యమే కీలకమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పేర్కొన్నారు. తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ కార్యకర్తలతో ఆయన ఆత్మీయంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు ఎదురవుతున్న స్థానిక సమస్యలు, పార్టీ కార్యక్రమాలపై కార్యకర్తలతో ఎమ్మెల్యే నేరుగా మాట్లాడారు. క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి వస్తున్న సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.ప్రజలకు మరింత చేరువగా ఉంటూ వారి అవసరాలను గుర్తించి పనిచేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. చర్చలకే పరిమితం కాకుండా. ఆత్మీయతను పంచుకుంటూ సమావేశం అనంతరం కార్యకర్తల కోసం ఏర్పాటు చేసిన ఆత్మీయ విందులో ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు స్వయంగా కార్యకర్తలకు వడ్డించారు. కార్యకర్తలతో కలిసి భోజనం చేస్తూ వారితో సరదాగా ముచ్చటించారు. ఎమ్మెల్యే స్వయంగా వడ్డిస్తూ ఆత్మీయతను చాటుకోవడంతో కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## కామవరం టీడీపీ మాజీ జడ్పీటీసీ రుద్రప్ప కన్నుమూత భౌతికకాయానికి నివాళులర్పించిన ఉరుకుంద మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ చెన్న బసప్ప,కొట్రేష్ గౌడ్



**కౌతాళం, ఆగష్టు 09** ప్రజా జ్యోతికౌతాళం మండలం కామవరం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ మాజీ జడ్పీటీసీ రుద్రప్ప కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ నిన్న హఠాన్మరణం చెందడం జరిగింది.వారి మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ చెన్న బసప్ప మరియు ఉరుకుంద కొట్రేష్ గౌడ్ మరియు రాజబాబు కామవరంలోని వారి స్వగృహానికి వెళ్లి భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## వీరబ్రహ్మేంద్ర స్వామి ని దర్శించుకున్న తుంకూర్ ఎస్పీ,తుంకూర్ సీఈవో



**బ్రహ్మంగారిమఠం- ప్రజా జ్యోతి ఆగస్టు 9** మండల కేంద్రంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి దర్శనానికై కర్ణాటక రాష్ట్రం,తుంకూర్ జిల్లా ఎస్పీగా పని చేయుచున్న కూరాకు వెంకట అశోక్,అదే రాష్ట్రం,అదే జిల్లాలో జిల్లా పరిషత్ సీఈఓ గా పనిచేయుచున్న బివి అశ్విజ ఇరువురు దంపతులు ఆదివారం శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకోవడం జరిగింది.అశోక్ తండ్రి కూరాకు వెంకటయ్య(రిటైర్డ్ డి.ఎస్.పి)బ్రహ్మంగారి మఠం మండలం జంగంరాజుపల్లె కు చెందిన వ్యక్తి కావడం మనందరికీ గొప్ప విషయం.ఆయన విద్యాభ్యాసమంతా కూడా బ్రహ్మంగారిమఠంలోనే జరిగిందని ఆయన తెలియజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ మాట్లాడుతూ ఈరోజు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామిని దర్శించడం నాకెంతో ఆనందంగా ఉందన్నారు. తెలుగు గంగ ప్రాజెక్టులో మునక ప్రాంతమైన జంగంరాజుపల్లె మా స్వగ్రామమని,తాను చిన్నప్పుడు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన సమయంలో ఇక్కడికి వచ్చే వాళ్ళమని,ఇక్కడ తిరిగే వాళ్ళమని ఆయన చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.ఇక్కడికి ప్రాంత వాసిగా ఐపీఎస్ కు సెలెక్ట్ అయ్యి తుంకూర్ జిల్లాలో పనిచేయడం నాకెంతో గర్వంగా ఉందన్నారు.ఈ సందర్భంగా వీరంతా స్వామి దర్శనం అనంతరం మఠాధిపతులు శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వామి ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.మఠాధిపతులు వీరికి ఆశీర్వచనం అందించి, శాలువా కప్పి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్రను అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మఠాధిపతి తమ్ముళ్లు వీరం బోట్లయ్య స్వామి,దత్తాత్రేయ స్వామి,స్థానిక ఎస్సై శివప్రసాద్,మండల టిడిపి నాయకులు ఎస్సార్ శ్రీనివాసులరెడ్డి,స్థానికులు , తదితరులు పాల్గొన్నారు.

# జడ్పి.టి.సి గంగరాజు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఘనంగా ఆదివాసి దినోత్సవ ఉత్సవాలు





### సంప్రదాయాలు, సంస్కృతి, హక్కులను కాపాడుకోవాలి.

**ఆదివాసీ ఐక్యతను చాటిన ఉత్సవాలు. అనంతగిరి మండలం. ఆగస్టు 9. ప్రజా జ్యోతి న్యూస్. రిపోర్టర్ శంకర్.** అల్లూరి సీతారామరాజు జిల్లా.అనంతగిరి మండలం అనంతగిరి మండల కేంద్రంలో ఆదివారం నాడు అనంతగిరి మండల జ.డ్పిటి.సి దిసరి గంగరాజు ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలు హక్కులు, విద్య, వైద్యం, ఉపాధి, అభివృద్ధి తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిలో సురేంద్ర పాల్గొన్నారు.గౌరవ అతిథులుగా అనంతగిరి జడ్పీటీ.సీ గంగరాజు, ఎం.పీ.పీమిత్తుల, జనసేన పార్టీ మండల అధ్యక్షులు చిట్టం మురళి, జై భారత్ నేషనల్ పార్టీ అరకు పార్లమెంట్ అధ్యక్షులు చంటిబాబు, ఆదివాసీ పరిరక్షణ మండల అధ్యక్షులు సోమేల స్వామి, తెలుగుదేశం పార్టీ అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు పాంగి రవీంద్ర, సీ.పీ.ఎం కార్యదర్శి, టోకురు మాజీ సర్పంచ్ మోస్య, విద్యాశాఖ అధికారులు బాలాజీ, నాగేశ్వరరావు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ ఆదివాసీ సమాజానికి ప్రత్యేకమైన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, ప్రకృతితో ముడిపడిన జీవన విధానం తరతరాలుగా కొనసాగుతున్నాయని తెలిపారు. అడవిని కేవలం జీవనాధారంగా కాకుండా తమ సంస్కృతి, సంప్రదాయాలకు పునాదిగా భావించే ఆదివాసీల జీవన విధానం ప్రపంచానికి ఎంతో ప్రత్యేకమైనదని పేర్కొన్నారు.ఆదివాసీల జానపద గీతాలు, దింస నృత్యాలు, సంప్రదాయ వేషధారణ, ప్రకృతి ఆరాధన, సామూహిక జీవన విధానం వంటి అంశాలు వారి సంస్కృతికి ప్రతీకలుగా నిలుస్తున్నాయని వివరించారు. ఆధునికత వేగంగా విస్తరిస్తున్న సమయంలో కూడా ఆదివాసీ యువత తమ మూలాలను, మాతృభాషను, ఆచారాలను, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు, ఉపాధి, యువతకు అవకాశాలు మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందని కార్యక్రమంలో పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా విద్య ద్వారానే ఆదివాసీ యువత భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగగలదని, ప్రతి కుటుంబం తమ పిల్లలను ఉన్నత విద్య వైపు ప్రోత్సహించాలని సూచించారు.ఆదివాసీల హక్కుల పరిరక్షణతో పాటు వారి సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఆదివాసీ సమాజం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ముందుకు నడవవలసిన అవసరం ఉందన్నారు. వేడుకల్లో విద్యార్థులు, యువత ఉత్సాహంగా పాల్గొని ఆదివాసీ ఐక్యతను చాటారు. ఆదివాసీ సంప్రదాయాలను ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు, దింస నృత్యాలతో వేడుకలు సందడిగా సాగాయి. విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.మన సంస్కృతి మన గుర్తింపు. మన సంప్రదాయాలు.మన వారసత్వం.. మన హక్కుల పరిరక్షణ మన బాధ్యత అనే సందేశంతో ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. అనంతగిరి ప్రాంతంలో ఆదివాసీ సమాజం ఐక్యతను, సాంస్కృతిక వైభవాన్ని చాటుతూ నిర్వహించిన వేడుకలు అందరిలోనూ స్ఫూర్తిని నింపాయి. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు భవిష్యత్ తరాలకు కూడా అందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్బారావు, గురుదొర, మల్లేశ్వరరావు సన్యాసిరావు, దేముడు, రామకృష్ణ, అర్జున్, బాలరాజ రాము, భగత్ రాయ్ కొండబాబు, పడాల్, మహిళలు దేవుడమ్మ, శ్రావణి, దేవి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం!..

### ఆదివాసీదినోత్సవానికి ముఖ్యఅతిథులుగా!..
### ఆంధ్రప్రదేశ్ రాష్ట్రబాలల పరిరక్షణ కమిషన్ సభ్యులు ఉండవల్లి గాంధీబాబు!.
### శ్రీనివాసమూర్తి!..మధుసూదన్ రావు!..






**వి.ఆర్.పురం,ఆగస్టు9(ప్రజాజ్యోతి ప్రతినిధి)**ఆదివాసలు అన్నీ రంగాల్లో రాణించాలని, ఆదివాసీలకు, మోసం, దగా, అబద్ధం, రావనిఆదివాసీల సాంప్రదాయాలు, కట్టు, బొట్టు, యాస, భాష, చెట్టు, పుట్టా, అడవినే దేవుడిగా బావిస్తారని ఆదివాసీ ప్రజానీకం తమ పిల్లలను ఉన్నతమైన చదువులు చదివించి ఉన్నతమైన శిఖరాలను ఉండేలా తల్లిదండ్రులు తీర్చిదిద్దాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కులు కమీషన్ సభ్యులు ఉండవల్లి గాంధీబాబు, స్పష్టం చేశారు. ఆదివారం ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకొని, వరరామచంద్రా పురం, మండలం రేఖపల్లి గ్రామంలో ఆదివాసీ నాయక పోడు సేవాసంఘం ఆధ్వర్యంలో ఘనంగా ఆదివాసీ దినోత్సవ వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా ముందుగా ఆదివాసీ అన్ని సంఘాలనాయకులూ గిరిజన పోరాటయోధులు చిత్ర పాటలకు, నివాళులు అర్పించి, కొబ్బరికాయలు కొట్టారు.బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు ఉండవల్లి గాంధీ బాబు,శ్రీనివాసమూర్తి,మధుసూదన్ రావు,కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఆదివాసీలు అన్నిరంగాలలో రాణించాలని, సూచించారు. బాల్య వివాహాలు అరికట్టాలని చెడు అలవాట్లకుదూరంగా ఉండాలని కోరారు. ఆదివాసీ సామాజిక, అభివృద్ధిలో చదువే ముఖ్యమని, చదువు, సాంప్రదాయాలు రెండుకళ్ళుగా భావించి అభివృద్ధిదిశగా సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రంలో ఆదివాసీ నాయకపోడు సేవసంఘం పోలవరంజిల్లా అధ్యక్షులు చిక్కాల బాలకృష్ణ, కార్యదర్శి కొట్టి కన్నంరాజులు, కోశాధికారి కొట్టి ముత్యాలరావు, గిరిజనసంఘం జిల్లాకార్యదర్శి పులి సంతోష్ కుమార్,కార్యదర్శి,పూనెం ప్రదీప్,కులపెద్దలు వీర్ల నాగేశ్వరావు, వేటకని రాములు,బేతి సారయ్య,బేతి రాజు, చింతకాయల భవాని శంకర్,కుర్లుబోయన కన్నంరాజులు, వేటకని మల్లయ్య, పిసా అధ్యక్షు కార్యదర్శిలు సారా పాండు రాజు,వేటకని సూరిబాబు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు పాయం లక్షణ రావు,సున్నం రాజు,ఉద్యోగులు నిరుద్యోగులు ఆదివాసీ ప్రజానీకం,తదితరులు పాల్గొన్నారు.

# పేపర్ ప్రకటనలు మాకొద్దు!..







### ఏజెన్సీలో ఆదివాసీలకు 100% ఉద్యోగ నియామక చట్టం కావాలి!..
### 1/70 చట్టం పరిరక్షణ కావాలి!..
### ప్రపంచఆదివాసిదినోత్సవ సభలో!..
### ఆదివాసీసంఘాల నాయకులు డిమాండ్!...

**వి.ఆర్.పురం,ఆగస్టు9(ప్రజాజ్యోతి ప్రతినిది)**పాలక ప్రభుత్వాల నుంచి ఆదివాసులు కోరుకునేది పేపర్ ప్రకటనలు కాదని, ఏజెన్సీలో ఆదివాసులకు100% ఉద్యోగాలు కల్పించేచట్టం, 1/70 చట్ట పరిరక్షణముఖ్యమని దీనితో పాటుగాఆదివాసీ హక్కులు చట్టాలనుకాపాడబడడం కోసం ఆదివాసులంతా కలసికట్టుగా ముఖ్యమించడానికి సిద్ధంగా ఉన్నామని, వర రామచంద్రాపురం, మండలంలోని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.ఆదివారం,ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా ఆదివాసి సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా,అన్నిఆదివాసిగ్రామాల్లో ఆదివాసి జెండా ఆవిష్కరణలు జరిపి రేఖపల్లి కేంద్రంగా సచివాలయ ప్రాంగణంలో పెద్దఎత్తున ప్రపంచ ఆదివాసి దినోత్సవ సభను జరుపుకోవడం జరిగిందని తెలిపారు. ముందుగా మండల ఎం.పీ.పీ,కారం లక్ష్మి,ప్రజాప్రతినిధులు మరియు ఆదివాసి సంఘాల నాయకులు అందరూ కలిసి ఆదివాసి అమరవీరుల ఫోటోలకు నివాళులర్పిస్తూ ఆదివాసి స్థూపాలవద్ద,కొబ్బరికాయలు కొట్టి,జండా ఆవిష్కరణ చేస్తూ సభా ప్రాంగణానికి చేరుకోవడం జరిగింది.అనంతరం వారు మాట్లాడుతూ ఆదివాసిహక్కులుచట్టాలను అమలుచేయడంలో పాలక ప్రభుత్వాలు సవతితల్లి ప్రేమను చూపడంతోపాటుగా ఉన్న చట్టాలనుతుంగలో తొక్కాలని చూస్తున్నాయని ఇదేవిధంగా వ్యవహరిస్తే ఆదివాసి సమాజం మొత్తంఉప్పెనలా కదిలి పోరుబాట నడుపుతుందని హెచ్చరిక చేశారు.రెండుమూడేళ్లుగా జీ.వో నెంబర్3,విషయంలో పాలక ప్రభుత్వాలు పేపర్ ప్రకటనలకు మాత్రమే పరిమితం అవుతున్నాయితప్ప, పునరుద్ధరించి చట్టంచేయడంలో చిత్తశుద్ధి చూపడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతంఆదివాసిల భూములకు రక్షణగా ఉన్నటు వంటి 1/70 చట్టాన్ని నిర్వీర్యం చేయాలని కొంతమంది కుట్ర దారులు కేసులు వేస్తుంటే ఆచట్టాన్ని కాపాడడం కోసం సుప్రీంకోర్టులో పిటిషన్, వేయకుండా ప్రభుత్వం చోద్యంచూస్తుందని అన్నారు. ఇదేతీరుగా పాలకులు వ్యవహరిస్తే ఆదివాసులందరినీ ఐక్యంచేసి కారం తమ్మన్న దొర, బీర్సా ముండా,కొమరం భీమ్, అల్లూరి,లాంటి ఆదివాసి అమరవీరుల స్ఫూర్తితో మెరుపుపోరాటం చేయక తప్పదని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆదివాసి హక్కులు చట్టాలనుఅమలు చేయడంలో ముందుకు రావాలని కోరారు. మండలంలో ప్రపంచఆదివాసీ దినోత్సవాన్ని జరుపుకోవడానికి సహకరించినవారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎం.పీ.పీ,జడ్పి.టి.సి, ఎం.పీ.టీ.సీ,లు సర్పంచులు పిసా కమిటీ సభ్యులు,ఆదివాసి సంఘాల నాయకులు,ప్రజా ఉద్యోగ సంఘాల నాయకులు ఆదివాసి ప్రజలు పాల్గొన్నారు.

# గిరిజన సంక్షేమానికి పెద్దపీట

**కలెక్టర్ వినోద్ కుమార్.**
**రాజకీయంగా ఎదగాలి**
**ఎమ్మెల్యే మాలకొండయ్య**



**బాపట్ల ఆగస్టు 9 ( ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి )** గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వాసుదేవ అన్నారు. అర్హులైన ప్రతి గిరిజనుడికి ప్రభుత్వ పథకాలు, సంక్షేమ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని బాపట్ల జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కలెక్టరేట్‌లోని ఈటీసీ హాల్‌లో జిల్లా స్థాయి వేడుకలు నిర్వహించారు. చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్యతో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి, అనంతరం ఆదివాసీ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో పనిచేసిన తన అనుభవాలను గుర్తుచేసుకున్నారు. గతంలో సుమారు 32 వేల మంది గిరిజనులకు కుల ధ్రువీకరణ పత్రాలు అందించేందుకు ఫాస్ట్‌ట్రాక్ విధానం అమలు చేసినట్లు తెలిపారు. బాపట్ల జిల్లాలో అర్హులైన గిరిజనులందరికీ ఓటు హక్కు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలపై విచారణ జరిపి అర్హత లేనివాటిని రద్దు చేస్తామని స్పష్టం చేశారు.గిరిజన కుటుంబాలకు ఆధార్, కుల ధ్రువీకరణ, ఇంటి స్థలం, ఇల్లు, రుణ సౌకర్యం తదితర వివరాలను కుటుంబాల వారీగా స్వర్ణ బాపట్ల పోర్టల్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 11 నుంచి 12 గంటల వరకు కలెక్టరేట్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటానని, మధ్యవర్తులు లేకుండా నేరుగా తనను కలవవచ్చని చెప్పారు. చీరాల నియోజకవర్గ అభివృద్ధికి రూ.100 కోట్ల నిధులు మంజూరు చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అంగీకరించారని తెలిపారు. ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య మాట్లాడుతూ గిరిజనులకు మెరుగైన జీవితం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కొమరం భీమ్, అల్లూరి సీతారామరాజు వంటి మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలని, గిరిజనులు రాజకీయంగా చైతన్యవంతులై పాలనలో మరింత భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, గృహ వసతి, రహదారులు, ఉపాధి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. గిరిజన కాలనీల్లో సిమెంట్ రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, గృహ వసతి వంటి కార్యక్రమాలకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.భూమి హక్కులు, ఇళ్ల కొరత, ఉపాధి సమస్యలను పరిష్కరించేందుకు అధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. భోగాపురం విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం, ధింసా నృత్యం గిన్నిస్ రికార్డు సాధించడం గిరిజన సంస్కృతికి లభించిన గౌరవమన్నారు. కార్యక్రమంలో ఇంచార్జి డీఆర్వో, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లవన్న, ఆర్డీఓ ఏ. హరికుమార్, డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్. విజయమ్మ, బీసీ సంక్షేమ, ఇంచార్జి గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి శివలీల, జిల్లా వ్యవసాయ అధికారిణి ఏ. లక్ష్మి, డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మావతి, ఎస్ఎస్ఏ పీవో శ్రీనివాస్, సాంఘిక సంక్షేమ శాఖ ఇంచార్జి డీడీ సత్యనారాయణ, జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి శ్రీనివాసరావు, గిరిజన సంఘాల నాయకులు దేవరకొండ రాము, ఎన్. మోహన్ ధర్మ, కె.వి. ప్రసాద్, శంకర్ ప్రసాద్, హరిబాబు, టి. శ్రీను, వి. సంజీవరావు, తిరువెళ్ల శ్రీను, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. గిరిజన చిన్నారుల సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి.

## కామవరం మాజీ జడ్పీటీసీ రుద్రప్ప కన్నుమూత

:- వారి మృతికి సంతాపం వ్యక్తం చేసిన వైఎస్ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి



**కౌతాళం,ఆగష్టు 09 ప్రజా జ్యోతి** కౌతాళం మండలం కామవరం గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ రుద్రప్ప కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ నిన్న హఠాన్మరణం చెందడం జరిగింది.వారి మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ కామవరంలోని వారి స్వగృహానికి వెళ్లి భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కామవరం మహేంద్ర రెడ్డి కౌతాళం వైసీపీ మండలం కన్వీనర్ దేశాయి ప్రహ్లాద ఆచారి,వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి,మాజీ సర్పంచ్ పాల్ దినకర్, సక్రితిక్కయ్య,వడ్డే రాము,అవతారం మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే స్టేషన్ లో చలివేంద్రం నిర్వాహకులకు బీజేపీ నాయకుల అభినందనలు.



**పాలకొల్లు. ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం.** ఆగస్టు 9. వేసవి కాలంలో రైల్వే ప్రయాణీకుల దాహార్తిని తీర్చేందుకు పాలకొల్లు రైల్వే స్టేషన్ లోఉభయ గోదావరి జిల్లాల గోవింద మాల కళ్యాణోత్సవ కమిటీ, పాలకొల్లు వారి ఆధ్వర్యంలో ఏప్రియల్ నెల నుండి ఇప్పటి వరకూ చలివేంద్రం 4 నెలలు పూర్తి అయ్యింది. ఈ సందర్భముగా పాలకొల్లు రైల్వే స్టేషన్ లో ఆదివారం జరిగిన ముగింపు సభలో బిజెపి పోడూరు మండలం ఇన్చార్జి, సెంట్రల్ రైల్వే డి ఆర్ యు సి సి మెంబర్ జక్కంపూడి కుమార్ మాట్లాడుతూ పాలకొల్లు రైల్వే స్టేషన్ లో గత మూడు సంవత్సరములుగా చలివేంద్రాన్ని విజయవంతముగా నిర్వహించారని ఆ స్ఫూర్తితో ఈ ఏడాది చలివేంద్రం నిర్వహించాలని వారిని తాను ప్రోత్సాహించానన్నారు. ఈ ఏడాది నాలుగు నెలల పాటు చలివేంద్రాన్ని గోవింద మాల కమిటీ దిగ్విజయంగా నడపడం అభినందనీయమన్నారు. ఇందుకు వారికి సహకరించిన రైల్వే స్టేషన్ మాస్టర్ కి, రైల్వే సిబ్బందికి, దాతలకు, బిజెపి పాలకొల్లు పట్టణ శాఖ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రైల్వే స్టేషన్ మాస్టారు, సత్యం గురుస్వామి, బీరక ప్రసాద్, కొల్లి కొండా ప్రసాద్, శీరం ఆనందకృష్ణ, మల్లవోలు సురేష్, చెరుకూరి శ్రీనివాసరావు, సత్యజిత్ కుమార్, బెల్లంకొండ శ్రీరామ్, జగపతి రాజు, దుడే హరనాథ్, ఇనుకొండ శేషాద్రి, అవెన్ జైను, నాళం బాబి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మరణంలోను వీడని...భార్యభర్తల బంధం





**దువ్వూరు,ఆగస్ట్09 ( ప్రజా జ్యోతి )** మరణంలోను భార్యాభర్తల బంధం వీడలేదు. అనారోగ్యంతో భర్త మృతి చెందగా, ఆ వార్త తెలిసిన వెంటనే భార్య మృతి చెందిన విషాద ఘటన దువ్వూరు లో చోటు చేసుకుంది.దువ్వూరు మండల కేంద్రంలోని టీచర్స్ కాలనీ కి చెందిన ఇరగంరెడ్డి వెంకట రామి రెడ్డి (79) రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయులు 2005 వ సంవత్సరంలో పుల్లా రెడ్డి పేట పాఠశాలలో పదవి విరమణ పొందారు.ఈయనకు భార్య నారాయణమ్మ (68) కుమారులు శ్రీహరి రెడ్డి, చంద్రహాస్ రెడ్డి, జయదేవ్ రెడ్డి ముగ్గురు సంతానం. ముగ్గురు హైదరాబాద్ లో స్థిరపడ్డారు. ఈ క్రమంలో గత కొన్ని రోజులుగా వెంకటరామిరెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నారు ఆదివారం ఉదయం ఆయన ఆరోగ్యం క్షీణించి హైదరాబాద్ ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు.భర్త మరణ వార్త విన్న భార్య నారాయణమ్మ సొమ్మసిల్లి పడిపోవడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారని బంధువులు తెలిపారు.భార్యాభర్తలు ఓకే సారి మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులతో పాటు, దువ్వూరు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాలను హైదరాబాద్ నుండి స్వగ్రామం దువ్వూరుకు తరలించి సోమవారం అంత్యక్రియలు చేయనున్నట్లు బంధువులు తెలిపారు.

## తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఆదివాసుల దినోత్సవంలో పాల్గొన్న రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు ఎన్. గోవిందునాయక్




**గుంతకల్లు ఆగస్టు 9 (ప్రజా జ్యోతి):** ఆదివారం మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో గిరిజన ఆదివాసుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గుంతకల్లు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే వెంకటరామి రెడ్డి మరియు జిల్లా ఉపాధ్యక్షు లు నైరుతిరెడ్డి ఆదేశాలతో గుంతకల్లు నియోజకవర్గా నికి చెందిన ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్. గోవిందు నాయక్ మరియు మాజీ సర్పంచ్ వెంకటేష్ నాయక్, గుత్తి ఎస్టీ సెల్ మండల కన్వీనర్ లాలు నాయక్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం గిరిజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు గుండా సురేంద్ర ఆధ్వర్యంలో తాడేపల్లి క్యాంపు కార్యాలయం నందు నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథి పార్టీ కార్యాలయ ప్రతినిధి ఎమ్మెల్సీ అప్పి రెడ్డి చేతుల మీదుగా పూజ కార్యక్రమం చేయడమైనది. గిరిజన మహిళలు ఆదివాసుల మరియు రాష్ట్ర అనుబంధ సంఘ ఎస్టీ నాయకులు అలాగే స్థానిక గుంటూరు విజయవాడ నాయకుల ఘనంగా పాల్గొని ఆదివాసుల గిరిజన దినోత్సవం ఘనంగా జరుపుకోవడం అయినది.

## మాచాపురంలో జోరుగా టీడీపీ ఇంటింటి ప్రచారం

**– కాశీం వలి**



**నందవరం, ఆగస్టు 09 (ప్రజాజ్యోతి ):** నందవరం మండల పరిధిలోని మాచాపురం గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం జోరుగా సాగింది. టీడీపీ మండల అధ్యక్షులు కాసీంవలి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు.ఈ సందర్భంగా కాసీంవలి మాట్లాడుతూ ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డా. బి.వి. జయనాగేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అలాగే ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీల మేరకు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న 'సూపర్ సిక్స్' పథకాలను విజయవంతంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు.టీడీపీ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడమే లక్ష్యంగా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నట్లు కాసీంవలి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐదే సాబ్ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోలీసుల ఆకస్మిక తనిఖీలు

**72 వాహనాలు. 20 మద్యం బాటిళ్లు సీజ్**



**బాపట్ల ఆగస్టు 9 ( ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి )**గ్రామాల్లో ఒక్కసారిగా పోలీసుల కదలిక పెరిగింది. ఇళ్ల తలుపులు తట్టి వివరాలు ఆరా తీయడంతో పాటు అనుమానిత వాహనాలు, వ్యక్తులపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు బాపట్ల జిల్లా పోలీసులు ఆదివారం రేపల్లె, చీరాల సబ్‌డివిజన్లలో ఏకకాలంలో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. మొత్తం 180 మంది అధికారులు, సిబ్బంది చేపట్టిన తనిఖీల్లో సరైన పత్రాలు లేని 66 ద్విచక్ర వాహనాలు, 6 ఆటోలు, అక్రమంగా నిల్వ ఉంచిన 20 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ ఆదేశాలతో జరిగిన ఈ తనిఖీల్లో ప్రతి ఇంటినీ పరిశీలించడంతో పాటు అక్కడ నివసిస్తున్న వ్యక్తుల వివరాలు, గుర్తింపు కార్డులను పోలీసులు తనిఖీ చేశారు. పాత నేరస్థులు, అనుమానితుల కదలికలపైనా ఆరా తీశారు.చీరాల డీఎస్పీ ఎం.డి. మొయిన్ సూచనలతో, చీరాల రూరల్ సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో వేటపాలెం, చిన్నగంజాం, కారంచేడు ఎస్సైలతో పాటు 70 మంది సిబ్బంది వినాయకపురం, పార్వతీపురం కాలనీల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 32 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలు, 20 మద్యం బాటిళ్లను సీజ్ చేశారు.రేపల్లె డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్ పర్యవేక్షణలో నగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని అల్లపర్రు, అగ్రహారం గ్రామాల్లో రేపల్లె రూరల్, టౌన్, వేమూరు సీఐలు, ఎస్సైలతో పాటు 110 మంది సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని 34 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలు సీజ్ చేశారు.నేర నియంత్రణతో పాటు అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాల పై ఉక్కుపాదం మోపేందుకు ఇలాంటి ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని ఎస్పీ ఉమామహేశ్వర్ తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై ప్రజలు 112 లేదా బాపట్ల జిల్లా కమాండ్ కంట్రోల్ నంబర్ 8333813228కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చేవారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

## కామవరం టీడీపీ మాజీ జడ్పీటీసీ రుద్రప్ప కు భౌతికకాయానికి నివాళులర్పించిన తెదేపా రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి అడివప్ప గౌడ్ ...



**కౌతాళం, ఆగష్టు 09 ప్రజా జ్యోతి** కౌతాళం మండలంలోని కామవరం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ మాజీ జడ్పీటీసీ రుద్రప్ప కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ నిన్న హఠాన్మరణం చెందడం జరిగింది. విషయం తెలిసిన వెంటనే తెదేపా రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి అడివప్ప గౌడ్ కామవరంలోని వారి స్వగృహానికి వెళ్లి భౌతికకా యానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెదేపా రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి అడివప్ప గౌడ్ తెలిపారు.

## పోలవరంప్రాజెక్టు ముంపు మండలాల్లో!..

**రాష్ట్ర నీటిపారుదల శాఖమంత్రి నిమ్మలరామానాయుడు పర్యటన?..**




**వి.ఆర్.పురం, ఆగస్టు9 (ప్రజాజ్యోతి ప్రతినిధి)** పోలవరం, ముంపు మండలాల్లో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటి పారుదల శాఖమంత్రి నిమ్మల రామానాయుడు, పర్యటించనున్నట్లు, విశ్వసనీయ సమాచారం, త్వరలో ముంపు మండలాలైన చింతూరు, వరరామచంద్రాపురం, కూనవరం, మండలాల్లో ఈ నెల ఆఖరులో పర్యటిస్తారని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని, జిల్లా ఉన్నతాధికారులు నుండి సమాచారం. సూచన ప్రాయంగా వెల్లడించారు.

# ఆదివాసీ హక్కుల సాధనకు లక్ష్మీపురంలో నిరసన గళం!

**జీవో నంబర్ 3, 1/70 చట్టం పరిరక్షణకు నల్ల బ్యాడ్జీలతో గిరిజన ఐక్యవేదిక సమర శంఖం**
**నెల్లిపాక నుంచి లక్ష్మీపురం వరకు భారీ ర్యాలీ**
**ప్రభుత్వ విధానాలపై వక్తల ఆగ్రహం**

**ఎటపాక, ఆగస్టు 9 (ప్రజాజ్యోతి):** ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలవరం జిల్లా ఎటపాక మండలం లక్ష్మీపురం కేంద్రంగా ఆదివాసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం భారీ బహిరంగ సభ నిర్వహించారు. సభకు ముందు నెల్లిపాక నుంచి లక్ష్మీపురం వరకు వేలాది మంది గిరిజనులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆదివాసీ సంప్రదాయ వాయిద్యాల మోతలు, హక్కుల సాధన నినాదాలతో ర్యాలీ హోరెత్తింది. సభకు గిరిజన సమాఖ్య జిల్లా నాయకులు వాసం రాము, పూనెం వెంకట్రావు, మీడియం సురేష్ అధ్యక్షత వహించారు.

**హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు**

సభలో ముఖ్య వక్తలుగా పాల్గొన్న ఆట రాష్ట్ర కార్యదర్శి అనిత శేఖర్, గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కాక అర్జున్ దొర, జాతీయ గిరిజన అభ్యుదయ సంఘం నాయకులు గొంది వెంకటేశ్వర్లు, కాకా లక్ష్మణ్ రావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు.ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ప్రభుత్వాలు ఆర్భాటంగా నిర్వహిస్తున్నప్పటికీ, మరోవైపు గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను, చట్టాలను బలహీనపరిచే చర్యలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. ఐక్యరాజ్యసమితి సూచనల మేరకు ఆదివాసీల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉన్నప్పటికీ, విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో గిరిజనులు ఇంకా వెనుకబాటుతనాన్ని ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**జీవో నంబర్ 3 రద్దుతో నిరుద్యోగ యువతకు నష్టం**

రాజ్యాంగంలోని 5వ, 6వ షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసీల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించిన జీవో నంబర్ 3 రద్దు కావడంతో మన్య ప్రాంత గిరిజన నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలను కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

**రెండు కీలక తీర్మానాలు**

సభలో పాల్గొన్న ఆదివాసీలు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రభుత్వాల వైఖరిపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రెండు కీలక తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. జీవో నంబర్ 3 పునరుద్ధరణ గిరిజన నిరుద్యోగ యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జీవో నంబర్ 3ను తక్షణమే పునరుద్ధరించి, దానికి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. 1/70 చట్టం పరిరక్షణ గిరిజన భూములకు రక్షణగా ఉన్న 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. సుప్రీంకోర్టులో ఉన్న ఇంప్లీడ్ పిటిషన్ల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకుని గిరిజనులకు అనుకూలంగా తమ వైఖరిని వెల్లడించాలని డిమాండ్ చేశారు.



ఆదివాసీ హక్కుల సాధనకు లక్ష్మీపురంలో నిరసన గళం!

**భారీగా తరలివచ్చిన ఆదివాసీలు**

ఈ కార్యక్రమంలో పొడియం కృష్ణ, తెల్లం శ్రీను, వెంకటేష్, వర్ష శేఖర్, తెల్లం నాగరాజ్, అనిత, రామకృష్ణ, కొరస భద్రమ్మ, బొర్రా అలివేలు, బుద్ధులు నాగేశ్వరరావు, వాసం ధర్మరాజుతో పాటు మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఆదివాసీ ప్రజలు, నాయకులు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతులకు 9 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేస్తాం

**-ఏడీఈ మాదర్ష సయ్యద్**
**--యర్రవరం విద్యుత్ సబ్‌స్టేషన్ తనిఖీ చేసిన అధికారులు**



**కాకినాడ జిల్లా ఆగస్టు 09(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ఏలేశ్వరం మండలం యర్రవరం గ్రామంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఏడీఈ) మాదర్ష సయ్యద్ పరిశీలించి,విద్యుత్ సరఫరా లాగ్‌బుక్,సంబంధిత రికార్డులను తనిఖీ చేసినట్లు తెలిపారు.పేరవరం గ్రామానికి చెందిన రైతులు ఇటీవల యర్రవరం సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టిన నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఏడీఈ మాదర్ష సయ్యద్ మాట్లాడుతూ.. పేరవరం గ్రామానికి చెందిన రైతులు నెల రోజులుగా వ్యవసాయ బోర్లకు సక్రమంగా విద్యుత్ సరఫరా కావడం లేదని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.రికార్డులను పరిశీలించగా ఈ నెల 3, 7 తేదీల్లో మాత్రమే వ్యవసాయ బోర్లకు త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు.రెండు పెద్ద చెట్లు విరిగి విద్యుత్ లైన్లపై పడటంతో ఒకరోజు, సాంకేతిక సమస్య కారణంగా 7వ తేదీన మరోసారి అంతరాయం ఏర్పడినట్లు తెలిపారు. మిగిలిన 28 రోజుల్లో వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ సరఫరా యథావిధిగా కొనసాగినట్లు పేర్కొన్నారు.ఉన్నతాధికారుల సూచనల మేరకు సబ్‌స్టేషన్‌ను పరిశీలించినట్లు, ఇకపై పేరవరం గ్రామ రైతులకు వ్యవసాయానికి 9 గంటల నిరంతర విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఏడీఈ వెంట ఏఈ సూర్యనారాయణ ఉన్నారు.

## గంజాయి, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**ఎటపాక సీఐ వి. కృష్ణ, ఎస్ఐ జి. అప్పలరాజు**
**గోగుబాకలో అవగాహన సదస్సు**




**ఎటపాక, ఆగస్టు 9 (ప్రజాజ్యోతి):** యువత భవిష్యత్తును నాశనం చేసే గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎటపాక సీఐ వి. కృష్ణ, ఎస్ఐ జి. అప్పలరాజు సూచించారు. మాదక ద్రవ్యాల విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గోగుబాక గ్రామంలో ఆదివారం ఎటపాక పోలీసుల ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు, యువతకు మాదక ద్రవ్యాల నివారణ, సైబర్ నేరాలు, రోడ్డు భద్రత తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడితే నేరాలకు పాల్పడే ప్రమాదం ఉందని, దాని ప్రభావం కుటుంబాలపై కూడా పడుతుందని తెలిపారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచితుల ఫోన్ కాల్స్‌కు స్పందించేటప్పుడు జాగ్రత్త వహించాలని, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలను ఎవరికీ చెప్పవద్దని సూచించారు. మహిళలు, చిన్నారులపై వేధింపులు లేదా నేరాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా అసాంఘిక కార్యకలాపాల పై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని, సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది, మహిళలు, యువత పాల్గొన్నారు.

## మారుతున్న జాబ్ మార్కెట్.. వాళ్లకే ఉద్యోగాలు!

ప్రస్తుతం ఉద్యోగ మార్కెట్‌లో ఊహకందని మార్పులు జరుగుతున్నాయి. కొత్త టెక్నాలజీలు వస్తున్నాయి. ఏఐ.. ఆటోమేషన్ వల్ల చాలా పనులు సులభంగా మారుతున్నాయి. కాబట్టి.. భవిష్యత్తులో ఉద్యోగం పొందడానికి కేవలం అనుభవం మాత్రమే సరిపోదు. కొత్త విషయాలను త్వరగా నేర్చుకునే సామర్థ్యం కూడా చాలా ముఖ్యం. ఎక్కువ అనుభవం ఉన్న వ్యక్తి కంటే.. కొత్త విషయాలను త్వరగా నేర్చుకునే వ్యక్తులకే ఎక్కువ ఉద్యోగావకాశాలు లభిస్తాయని విద్యావేత్త, రచయిత ప్రశాంత్ కిరాడ్ పేర్కొన్నారు. దీనికి కారణం.. స్కిల్స్ ఎప్పటికప్పుడు మారుతుండటమే అని వెల్లడించారు. కాబట్టి ఎప్పటికప్పుడు కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడం చాలా అవసరం అని ఆయన అన్నారు. ఉద్యోగ ప్రపంచంలో మనగలగాలంటే.. ఏ స్కిల్స్ నేర్చుకోవాలి? అని మాత్రమే కాకుండా.. అవసరం వచ్చినప్పుడు కొత్త స్కిల్ ఎంత వేగంగా నేర్చుకోగలను అనే విషయాన్ని కూడా తప్పకుండా ఆలోచించాలి. అయితే ఇక్కడ తెలుసుకోవాల్సిన విషయం ఏమిటంటే.. కొత్త స్కిల్ నేర్చుకున్న వెంటనే రిజల్ట్స్ రావాలని ఆశించకూడదు. కనీసం 90 రోజుల పాటు ప్రతిరోజూ ఫోకస్ పెట్టి ప్రాక్టీస్ చేసి, ఆ తర్వాత అది మనకు ఉపయోగపడుతుందా లేదా అని నిర్ణయించుకోవాలి. ప్రపంచం మారుతున్నప్పుడు.. మనం కూడా మారాలి.

## సాహిత్య విమర్శకు విస్తృతాధ్యయనం అవసరం

**అనంతపురం:ఆగష్టు 9(ప్రజా జ్యోతి)** సాహిత్య విమర్శకు విస్తృత అధ్యయనం, లోతైన అవగాహన అవసరమని నంద్యాల జిల్లా అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు, గోరుమానుకొండ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ టి.మరియదాస్ అన్నారు. అనంతపురంలోని ఆర్‌డీటీ ఏకాలజీ సెంటర్‌లో ఆదివారం రాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 'సాహిత్య విమర్శ-పాఠశాల' వర్క్‌షాప్‌లో 'ఆధునిక సాహిత్యం-విమర్శ-విభిన్న ధోరణులు' అంశంపై ఆయన ప్రసంగించారు. సాహిత్య విమర్శ అనేది లోతైన ప్రక్రియ అని, కవులు, రచయితల రచనల్లోని అంతర్గత ఆలోచనలు, వస్తువును వెలికితీసి సమాజానికి పరిచయం చేయడం విమర్శ లక్ష్యమని తెలిపారు. మంచి సాహిత్య విమర్శను రచయితలు ఆహ్వానించడం ద్వారా తమ రచనలను మెరుగుపరుచుకుని మరిన్ని సృజనాత్మక రచనలకు రూపకల్పన చేయవచ్చన్నారు. మానవ సంబంధాలను ప్రధాన వస్తువుగా చేసుకుని రచనలు చేసే వారికి విమర్శ దిశానిర్దేశం చేస్తుందన్నారు. మార్క్సిస్టు సాహిత్య విమర్శ ద్వారా పీడిత సమాజానికి మేలు చేకూర్చవచ్చని పేర్కొన్నారు. గతితార్కిక, చారిత్రక భౌతికవాద దృక్పథాలను సాహిత్య విమర్శలో అన్వయించడం ద్వారా ఆధునిక మానవుడి అవసరాలను అర్థం చేసుకుని నూతన రచనా శైలిని అనుసరించవచ్చన్నారు.



**మరియదాస్‌కు ప్రశంసాపత్రం**

ఈ సందర్భంగా మరియదాస్ ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు వీక్షణం పత్రిక సంపాదకులు వేణుగోపాల్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, రాష్ట్ర అరసం కార్యదర్శి రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా ఆయనకు ప్రశంసాపత్రం అందజేశారు.

## భూపాలపట్నంలో వైభవంగా నంగాలమ్మకు సారె సమర్పణ

**--ఆషాఢ మాసంలో తొలిసారిగా అమ్మవారికి సారె సమర్పించిన గ్రామస్తులు**
**మహిళల కోలాటాలు.. --మంగళ వాయిద్యాలతో ఘనంగా ఊరేగింపు**
**--భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు..భక్తులకు పులిహోర పంపిణీ**

**కాకినాడ జిల్లా ఆగస్టు 09(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ఆషాఢ మాస పూజల సందర్భంగా కాకినాడ జిల్లా జగ్గంపేట నియోజకవర్గం, కిర్లంపూడి మండలం భూపాలపట్నం గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ నంగాలమ్మ అమ్మవారికి తొలిసారిగా సారె సమర్పణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామస్తులు,మహిళలు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో పసుపు, కుంకుమ, గాజులు, పట్టు వస్త్రాలు,పండ్లు,పిండివంటలతో కూడిన సారెను మంగళ వాయిద్యాలు,కోలాటాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లారు.అనంతరం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు నిర్వహించి పసుపు,కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు.ఆషాఢ మాసంలో తొలిసారిగా సారె సమర్పణ జరగడంతో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్ర




సాదాలు,పులిహోర పంపిణీ చేశారు.గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో, పాడిపంటలతో, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## టీడీపీ మండల అధ్యక్షులకు కాసిం వలికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కార్యకర్తలు

**నందవరం, అగస్ట్ 09(ప్రజాజ్యోతి ):** మండలం పరిధిలో ని మాచపురం గ్రామం మాజీ సర్పంచ్, ప్రజలకు అండదండ ఉండే ప్రజా సమస్యలపై పోరాడి సైనికుడులా ప్రజాసమస్యలు పరిష్కరించి గ్రామ అభివృద్ధికి ఎంతో కృషిచేసిన నాయకుడికి, అల్లా హే వందేళ్ళు ఆయుష ఆరోగ్యం కలిగించును గాక లెజెండరీ టిడిపి నందవరం మండలఅధ్యక్షులు మాచపురం కాసిం వలి అన్నగారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన గ్రామ యువ నాయకుడు బడే సాబ్, ప్రజలు కార్యకర్తలు తెలిపారు.




## ఘనంగా సూపర్ స్టార్ మహేష్ బాబు జన్మదిన వేడుకలు..



**కంబదూరు ఆగస్టు:9(ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,** కంబదూరు మండల పరిధిలోని ఒంటారెడ్డిపల్లి గ్రామం లో సినీ నటుడు సూపర్ స్టార్ మహేష్ బాబు, జన్మదిన వేడుకలు ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలను ఒకరికొకరు తినిపించుకుంటూ, సంతోషంగా సంబరాలను నిర్వహించుకున్నారు. అనంతరం సినీ నటుడు మహేష్ బాబు, అభిమానులు అన్నదాన కార్యక్రమం నిర్వహించి, ఒంటారెడ్డి పల్లి గ్రామంలో ఇంటింటికి గిన్నెలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహేష్ బాబు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే పితానికి అభివందనం

**కవిటం ప్రధాన రహదారికి మహర్దశ**
**నేడు రూ.2 కోట్ల రహదారి నిర్మాణానికి శంకుస్థాపన**
**శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పితాని**
**రహదారి నిర్మాణానికి కృషి చేసినందుకు కూటమి నాయకులు కృతజ్ఞతలు**
**నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉన్నత పదవులు అధిరోహించాలంటూ ప్రశంసలు**



**ప్రజా జ్యోతి, పోడూరు, - ఆగస్టు -09 :** ఆచంట నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, , అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు పనిచేస్తున్న కృషివలుడు నాడు రహదారులు మరియు భవనాల శాఖ మంత్రిగా పనిచేసిన మాజీ మంత్రి, ఏపీ శాసన సభ హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్, రాష్ట్ర టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఎన్నో ఎన్నెన్నో ఆర్ అండ్ బి రహదారులుగా ఉన్నతీకరించిన ఘనత ఆయనకే దక్కుతుంది. గోదావరి పరివాహ నియోజకవర్గ కావడంతో రహదారులు నిర్మించిన అనదికాలంలోనే మరమ్మత్తులకు గురై ప్రజల ఇబ్బందులను గుర్తించిన ఆయన ఆర్ అండ్ బి రహదారులుగా పెద్ద ఎత్తున నిధులను మంజూరు చేయించడంలో ఆయనకు ఆయనే సాటి. తద్వారా నియోజకవర్గంలో సీసీ రహదారులు, తారు రోడ్లతో ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందిన ప్రతిసారి కొత్త రూపుతో కళకళలాడాయి. గత ఐదేళ్లలో మరమ్మలకు గురైన రహదారుల నిర్మాణానికి తగినంత ప్రాధాన్యత కల్పించకపోవడం, చర్యలు చేపట్టకపోవడం తో ప్రమాదకరంగా మారాయి. మళ్లీ కూటమి ప్రభుత్వంలో ప్రజల అండదండలతో గెలుపొందిన ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ కవిటం వంతెన నుండి సంత మార్కెట్ వరకు రూ.2 కోట్ల వ్యయంతో సిసి రహదారి నిర్మాణానికి నిధులు మంజూరుకు కృషి చేశారు. దీంతో ఆ రహదారికి మహర్దశ కలిగింది. సోమవారం సాయంత్రం 4.30 గంటలకు ఈ రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసేందుకు విచ్చేయుచున్న ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణకు కవిటం గ్రామ టిడిపి గ్రామ అధ్యక్షుడు గుబ్బల అప్పన్నస్వామి, కూటమి నాయకులు, గ్రామస్తులు, పలువురు పెద్దలు నిధులు మంజూరు చేసినందుకు గ్రామం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉన్నత పదవులు అధిరోహించాలని పలువురు ప్రశంసించారు.

# గిరిజన హక్కుల కోసం 'మన్యం' సమర శంఖం!

## కోతులగుట్టలో పోటెత్తిన ఆదివాసీ చైతన్యం

## రేలా నృత్యాలు, కొమ్ముకోయ విన్యాసాలతో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



**కూనవరం, ఆగస్టు 9 (ప్రజాజ్యోతి);** మన్యం గుండెల్లో ఆత్మగౌరవ జ్వాలలు రగిలించిన అమరుల త్యాగాలను స్మరిస్తూ, గిరిజన అస్తిత్వం, హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడాలని పోలవరం జిల్లా కూనవరం మండలం కోతులగుట్ట గ్రామం నుండి గిరిజన సమూహం సింహగర్జన చేసింది. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రోజున కోతులగుట్ట గ్రామంలో గిరిజన జేఏసీ ఆధ్వర్యంలో వేడుకలు కన్నుల పండువగా, అత్యంత అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామం సమర ఉత్సాహంతో, సాంస్కృతిక శోభతో పరవశించిపోయింది. కార్యక్రమంలో భాగంగా గిరిజన పోరాట యోధుడు, "జల్, జంగల్, జమీన్" నినాదకర్త మన్యం వీరుడు కొమరం భీమ్ విగ్రహంతో పాటు ప్రముఖ ఆదివాసీ విప్లవ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నాయకులు, గ్రామస్తులు భావోద్వేగాల నడుమ ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం గిరిజన ఐక్యతా జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కుంజ అనిల్ కుమార్ అధ్యక్షతన ఆదివాసీ జెండాను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

### ప్రత్యేక ఆకర్షణగా సంప్రదాయ వేషధారణలు, రేలా నృత్యాలు

ఈ వేడుకలకు గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ప్రాణం పోసాయి. సాంప్రదాయ గిరిజన వేషధారణలో వచ్చిన చిన్నారుల ముద్దుముద్దు ముచ్చట్లు, కొమ్ముకోయ నృత్యాలు, మహిళల రేలా పాటల శివతాండవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తమ సంస్కృతే తమ ఊపిరి అని చాటుతూ, తరతరాల నాటి ఆచార వ్యవహారాలను ప్రతిబింబించేలా సాగిన సాంస్కృతిక కార్యక్రమాలు మైమరపించాయి.

### హక్కుల సాధనకై సమర శంఖం

ఈ సందర్భంగా జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కుంజ అనిల్ మాట్లాడుతూ, "భారత రాజ్యాంగం ఆదివాసీలకు కల్పించిన 5వ షెడ్యూల్, పెసా చట్టం, అటవీ హక్కుల చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి. గిరిజనుల జల, జంగల్, జమీన్ ప్రాథమిక హక్కులను కాలరాసే ఏ శక్తినైనా ఐక్యంగా తిప్పికొడతాం" అని హెచ్చరించారు. గిరిజనుల జీవన విధానం, సంస్కృతిని కాపాడుకుంటూనే, హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

### పెద్ద ఎత్తున హాజరైన ప్రజాప్రతినిధులు, ప్రజలు

ఈ మహోత్సవంలో స్థానిక ఎంపీపీ పాయం రంగమ్మ, జడ్పీటీసీ గుజ్జ విజయ, ఆదివాసీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తుష్టి జోగారావు, వివిధ గిరిజన సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, రాజకీయనాయకులు, గ్రామ పెద్దలు, సర్పంచ్‌లు, మహిళలు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# జర్నలిస్టుల సంక్షేమమే : ఏపీజేపీఎస్ ధ్యేయం

**హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటం.**

**బేతంచెర్ల మండల కమిటీ ఏర్పాటు**



**బేతంచెర్ల:ఆగస్ట్ 09,(ప్రజా జ్యోతి)** జర్నలిస్టుల సంక్షేమం, భద్రత, హక్కుల పరిరక్షణే ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల పరిరక్షణ సమితి (ఏపీజేపీఎస్) ప్రధాన లక్ష్యమని రాష్ట్ర అధ్యక్షులు ముత్యాల శివరామయ్య ఆచారి అన్నారు. బేతంచెర్లలోని ఏపీజేపీఎస్ కార్యాలయంలో ఆదివారం నూతన మండల కమిటీ ఎన్నిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బేతంచెర్ల మండల ఏపీజేపీఎస్ అధ్యక్షునిగా జె. మద్దిలేటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు శివరామయ్య ఆచారి మాట్లాడుతూ.. జర్నలిస్టుల్లో పెద్ద, చిన్న అనే తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరికీ సమాన గౌరవం, న్యాయం అందేలా ఏపీజేపీఎస్ కృషి చేస్తుందన్నారు. విధి నిర్వహణలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులపై సమితి నిరంతరం పోరాడుతుందని తెలిపారు. జర్నలిస్టుల భద్రత, రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, ఏ జర్నలిస్టుకు సమస్య ఎదురైనా ఏపీజేపీఎస్ అండగా నిలిచి పరిష్కారం కోసం అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగే వరకు పోరాడుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, వాటి పరిష్కారానికి నిరంతర కృషి చేస్తామని పేర్కొన్నారు. జర్నలిస్టులంతా ఐక్యంగా ఉండి, పరస్పరం సహకరించుకుంటూ ఏపీజేపీఎస్‌ను మరింత బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ కోసం సంఘటితంగా ముందుకు సాగితేనే సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని అన్నారు. నూతన కమిటీకి అభినందనలు బేతంచెర్ల మండల అధ్యక్షుడిగా జె. మద్దిలేటి ఎన్నిక కావడంతో పలువురు జర్నలిస్టులు ఆయనకు అభినందనలు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నూతన కమిటీ చురుకైన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి విజయ్, సహాయ కార్యదర్శి ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రంగన్న గౌడ్, బేతంచెర్ల పాత్రికేయులు ఆంధ్రపత్రిక వారల మద్దిలేటిస్వామి, సాక్షి మదన భోపాల్ నాయుడు, సూర్య నాగమధు దస్తగిరి, బాలశేఖర్, రాముడు, జెలాల్ భాష, నాగరాజు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.




# అర్చన కాలనీలో ఘనంగా ఆషాఢమాస బోనాలు



**మేడ్చల్ :** ఆషాఢ బోనాల సందర్భంగా మేడ్చల్ సర్కిల్ పరిధిలోని కిష్టాపూర్ – పూడూరు డివిజన్‌లో గల కిష్టాపూర్ అర్చన కాలనీలో ఆదివారం నల్లపోచమ్మ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించారు. ఉదయం ఘటమును ఊరేగింపుగా తీసుకొని వచ్చి అమ్మవారికి సమర్పించడం జరిగింది. అనంతరం కాలనీ మహిళలు సంప్రదాయ దుస్తుల్లో బోనాలను అలంకరించి, నల్లపోచమ్మ అమ్మవారికి సమర్పించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీక

**తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**

**మణికొండ లోని వెంకటేశ్వర కాలనీలో బోనాల ఉత్సవాలలో పాల్గొన్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**



**రాజేంద్రనగర్ :** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీక అని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం మణికొండలోని నెక్నంపూర్ డివిజన్ వెంకటేశ్వర కాలనీలోని మైసమ్మ గుడి వద్ద బోనాల సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండేలా అమ్మవారికి ప్రార్ధనలు చేసినట్లు తెలియజేశారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతిఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్, కాంగ్రెస్ పార్టీ నేక్నంపూర్ డివిజన్ అధ్యక్షుడు జితేందర్, నాయకులు కిరణ్ కుమార్, లక్ష్మీనారాయణ, పురుషోత్తం, అహ్మద్ షా ఖాన్, రాజు, రవికాంత్, నరేందర్, శ్రీనివాస్, వేణు రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# రాయపోల్ బోనాల వేడుకల్లో పాల్గొన్న మల్ రెడ్డి రంగారెడ్డి...

**మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా పేర్కొన్న ఎమ్మెల్యే...**

**గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం...**





**ఇబ్రహీంపట్నం :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామంలో జరిగిన మహంకాళీ బోనాల వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా... ఎమ్మెల్యే రాకతో సందడిగా మారింది. ఈ సందర్భంగా గ్రామస్థులు మల్ రెడ్డి రంగారెడ్డికి ఘనస్వాగతం పలికారు. బీరప్ప స్వామి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. గ్రామస్తులు బోనాల వేడుకకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం....రాయపోల్ గ్రామంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కు చెందిన రూ. 20లక్షల నిధులతో నిర్మించతలపెట్టిన సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే మల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అలాగే, హెచ్ఎండీఏ నిధులు రూ. 50లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రారంభించారు. పర్యటనలో భాగంగా ఇందిరమ్మ ఇల్లును ఎమ్మెల్యే ప్రారంభించారు. నియోజకవర్గంలోని ప్రతీ గ్రామం అభివృద్ధిలో పోటీపడేలా నిధుల కేటాయింపు చేస్తున్నట్లు మల్ రెడ్డి రంగారెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ఏఎంసి వైస్ చైర్మన్, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# అప్పుడు కలవనివ్వలేదు.. ఇప్పుడు అదే హీరోతో!



మలయాళ నటి మమితా బైజు ప్రస్తుతం వరుస విజయాలతో మంచి జోష్‌లో ఉంది. ప్రేమలు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది. 'డ్యూడ్' 'జన నాయకన్' చిత్రాలతో మరింత గుర్తింపు తెచ్చుకుంది. సూర్యతో కలిసి 'విశ్వనాథ్ అండ్ సన్స్'తో ఈ శుక్రవారం(ఆగస్టు 14) ప్రేక్షకులను పలకరించనుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ కేరళలో శనివారం జరిగింది. ఇందులో మాట్లాడిన మమిత తన చిన్ననాటి జ్ఞాపకాలని గుర్తుచేసుకుంది. '2015లో సూర్య ఓ కార్యక్రమం కోసం కొచ్చి వచ్చారు. అప్పుడు నేను ఎనిమిది, మా అన్నయ్య ఇంటర్ చదువుతున్నాం. సూర్యని చూసేందుకు అన్నయ్య తన స్నేహితులతో కలిసి కొచ్చి వెళ్లాడు. నేనూ వెళ్తానంటే మా తల్లిదండ్రులు పంపించలేదు. అన్నయ్య సూర్యతో ఫొటో దిగి చూపించాడు. నేను చాలా బాధపడ్డాను. ఇప్పుడు అదే హీరోతో కలిసి నటించే అవకాశం దక్కింది. ఈ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సూర్యతో కలిసి ఒకే వేదికపై నిలబడటం అదృష్టంగా భావిస్తున్నాను' అని మమిత చెప్పుకొచ్చింది. అభిమానిగా సూర్యని చూడాలనుకున్న తనకు.. ఇప్పుడు ఆయన సినిమాలో నటించే అవకాశం రావడం గొప్ప ఆశీర్వాదమని పేర్కొంది. వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ చిత్రం 45 ఏళ్ల వ్యక్తి 20 ఏళ్ల అమ్మాయితో ప్రేమలో పడటం అనే కాన్సెప్ట్‌తో తెరకెక్కించారు. ఇందులో రవీనా టాండన్, రాధికా శరత్‌కుమార్, నాజర్ తదితరులు కీలక పాత్రలు చేశారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతమందించాడు.

# పోలీసులు నన్ను పువ్వుల్లో పెట్టుకుని తీసుకొచ్చారు



ప్రస్తుతం 'రాకా' సినిమాతో బిజీగా ఉన్న అల్లు అర్జున్.. వైజాగ్?లో కనిపించాడు. తన 'ఏఏఏ సినిమాస్' మల్టీప్లెక్స్‌ని ఘనంగా ప్రారంభించాడు. హైదరాబాద్‌లో ఇప్పటికే ఇలా ఓ మల్టీప్లెక్స్ ఉండగా.. ఇప్పుడు విశాఖపట్నంలోనూ లాంచ్ చేశాడు. ఈ సందర్భంగా బన్నీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఇప్పుడు వైజాగ్ రోడ్డుపై అస్సలు నడవలేకపోతున్నానని చెప్పుకొచ్చాడు. 'గంగోత్రి' రోజుల్లో వైజాగ్ రోడ్డుపై ఎవరూ నన్ను గుర్తుపట్టేవారు కాదు. ఇప్పుడు అదే రోడ్డుపై నడవలేకపోతున్నాను. 'రాకా' షూటింగ్ ముంబైలో జరుగుతోంది. వైజాగ్ ప్రజల కోసం ఒక రోజు బ్రేక్ అడిగి వచ్చాను. అయితే పోలీసులు నన్ను ఎయిర్‌పోర్ట్ నుంచి పువ్వుల్లో పెట్టుకుని తీసుకొచ్చారు. వాళ్లకు థ్యాంక్స్' అని అన్నాడు. ఇక ఎదురుగా ఉన్న కొందరు అభిమానులు ఫొటో కావాలని అడగడంతో అందరూ ఇక్కడికి వచ్చేయండి అని స్టేజీపైకి ఆహ్వానించాడు. ఫ్యాన్స్‌కి నో అని చెప్పటం నా వల్ల కాదమ్మా అని అన్నాడు. ఎనిమిది స్క్రీన్లు ఉన్న ఈ మల్టీప్లెక్స్‌లో 'పుష్ప'లో గడ్డం కింద చేయి పెట్టే పోజు ఉన్న బన్నీ బొమ్మని ప్రదర్శన కోసం ఉంచారు. అలానే అల్లు అర్జున్‌కి సంబంధించిన పలు సినిమా స్టిల్స్ కూడా ఉంచారు. ఇకపోతే ప్రస్తుతం 'రాకా' చేస్తూ బిజీగా ఉన్నప్పటికీ మరోవైపు లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలోనూ తన 23వ మూవీ చేయనున్నాడు. దీని ప్రీ ప్రొడక్షన్ వర్క్ హైదరాబాద్‌లో జరుగుతోంది.

# వెండితెరను వణికించేందుకు రాబోతున్న మీర్జాపూర్..

## ట్రైలర్ వచ్చేది ఆరోజే!

భారతీయ ఓటీటీ చరిత్రలో సరికొత్త సంచలనాలు సృష్టించి, ప్రేక్షకులను విపరీతంగా అలరించిన మోస్ట్ పాపులర్ క్రైమ్ థ్రిల్లర్ ఫ్రాంచైజీ 'మీర్జాపూర్' ఇప్పుడు బిగ్ స్క్రీన్ పైకి దూసుకొస్తోంది. ఓటీటీ నుంచి నేరుగా వెండితెరపైకి అడుగుపెడుతున్న ఈ భారీ చిత్రం 'మీర్జాపూర్: ది మూవీ' కోసం దేశవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. కాగా, సినిమాపై అంచనాలను తారాస్థాయికి తీసుకువెళ్లేందుకు మేకర్స్ తాజాగా ఒక క్రేజీ అప్‌డేట్‌ను అనౌన్స్ చేశారు. ఈ చిత్రానికి సంబంధించిన మోస్ట్ అవేటెడ్ ట్రైలర్‌ను ఆగస్టు 11న గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు. విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో సోషల్ మీడియాలో అభిమానుల ఉత్సాహం తారస్థాయికి చేరింది. కాలీన్ భయ్యా (పంకజ్ త్రిపాఠి), గుడ్డు పండిట్ (అలీ ఫజల్) మరియు అందరితో పాటు ప్రత్యేక ఆకర్షణగా నిలిచే మున్నా భయ్యా (దివ్యేందు) వంటి ఐకానిక్ పాత్రలతో ఈ సినిమా తెరకెక్కుతోంది. కేవలం డిజిటల్ స్క్రీన్‌లకే పరిమితం కాకుండా, ఈసారి ఏకంగా వెండితెరపై పవర్-ప్యాక్డ్ యాక్షన్‌తో సరికొత్త రికార్డులు సృష్టించేందుకు ఈ ఫ్రాంచైజీ సిద్ధమైంది. ఈ యాక్షన్ డ్రామా ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 4న కేవలం థియేటర్లలో మాత్రమే విడుదల కానుంది



# 'చెన్నై లవ్ స్టోరీ' ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్.. కిరణ్ అబ్బవరం మూవీ స్ట్రీమింగ్ ఎక్కడ అంటే?



టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నటించిన లేటెస్ట్ లవ్ ఎంటర్‌టైనర్ 'చెన్నై లవ్ స్టోరీ' థియేటర్లలో మంచి స్పందన అందుకుంది. జులై 24న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా పాజిటివ్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను రాబట్టింది. 'బేబీ' సినిమాతో సక్సెస్ అందుకున్న సాయి రాజేశ్, నిర్మాత ఎస్‌కేఎన్ కాంబినేషన్‌లో వచ్చిన ఈ చిత్రం మరో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. సుమారు రూ.15 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన 'చెన్నై లవ్ స్టోరీ' ప్రపంచవ్యాప్తంగా రూ.50 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించినట్లు చిత్రబృందం వెల్లడించింది. థియేటర్లలో సినిమా చూసిన ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందనతో పాటు.. ఓటీటీలో ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్న వారి సంఖ్య కూడా పెరిగింది. ఈ సినిమాకు సంబంధించిన డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ సోనీ లివ్ సొంతం చేసుకున్నట్లు సమాచారం. ఆగస్టు 21 నుంచి ఈ సినిమా ఓటీటీలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే అధికారిక స్ట్రీమింగ్ తేదీపై మేకర్స్ లేదా ఓటీటీ సంస్థ నుంచి స్పష్టమైన ప్రకటన రావాల్సి ఉంది. తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ 'చెన్నై లవ్ స్టోరీ' స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి రానున్నట్లు సమాచారం. థియేటర్లలో మిస్ అయిన ప్రేక్షకులు, ఇప్పటికే చూసి మరోసారి సినిమా చూడాలనుకునేవారికి ఓటీటీ రిలీజ్ మంచి అవకాశంగా మారనుంది. 'చెన్నై లవ్ స్టోరీ' కథ విషయానికి వస్తే.. నివి అనే యువతి తన ప్రియుడు అజయ్‌ను పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంటుంది. పెళ్లికి సిద్ధమవుతున్న సమయంలో అజయ్ తనకు మరో అమ్మాయి అంటే ఇష్టమని చెప్పి ఆమెతో విడిపోతాడు. ఊహించని బ్రేకప్‌తో నివి తీవ్రంగా కుంగిపోతుంది. ఆ బాధ నుంచి బయటపడేందుకు ఆమె స్నేహితులు నివిని చెన్నైకి తీసుకెళ్తారు. కానీ అక్కడ కూడా ఆమె తన గతాన్ని మర్చిపోలేకపోతుంది. క్రమంగా మద్యానికి బానిసగా మారుతుంది. అదే సమయంలో అనుకోకుండా ఆమె జీవితంలోకి స్టీవెన్ శంకర్ అనే యువకుడు వస్తాడు. అనాథ అయిన స్టీవెన్‌కు డైరెక్టర్ కావాలన్నది కల. నివి స్నేహితుల గ్యాంగ్ అతడికి ఆశ్రయం కల్పిస్తుంది. మొదట్లో స్టీవెన్ చేసే పనులు, అతడి ప్రవర్తన నివికి చిరాకు తెప్పిస్తాయి. అయితే కాలక్రమంలో స్టీవెన్ మాటలు, అతడి ఆలోచనా విధానం నివిలో మార్పు తీసుకొస్తాయి. తన గత ప్రేమ వైఫల్యం నుంచి నెమ్మదిగా బయటపడిన నివి.. స్టీవెన్‌కు దగ్గరవుతుంది. ఇద్దరి మధ్య ప్రేమ మొదలవుతుంది. అయితే అప్పుడే నివి గతం మరోసారి ఆమె ముందుకు వస్తుంది. అజయ్ మళ్లీ ఆమె జీవితంలోకి ఎందుకు వచ్చాడు? నివి, స్టీవెన్‌ల ప్రేమకు ఎలాంటి సమస్యలు ఎదురయ్యాయి? చివరకు నివి ఎవరిని పెళ్లి చేసుకుంది? అనే అంశాలతో కథ ఆసక్తికరంగా సాగుతుంది. ఈ చిత్రంలో కిరణ్ అబ్బవరం సరసన శ్రీ గౌరీ ప్రియ హీరోయిన్‌గా నటించారు. త్రిగుణ్, దేవీ ప్రసాద్, సిరి హన్మంతు, పి. వాసు తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమాతో రవి నంబూరి దర్శకుడిగా పరిచయం అయ్యారు.




# విజయ్ సేతుపతి 'స్లమ్ డాగ్' నుంచి అదిరిపోయే అప్డేట్.. ఇంటెన్స్ లుక్‌లో టబు !

కోలీవుడ్ వెర్సటైల్ యాక్టర్ మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి, టాలీవుడ్ డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్లమ్ డాగ్'పై మరోసారి ఆసక్తి పెరుగుతోంది. ఈ ప్రాజెక్ట్ ప్రకటించిన సమయంలోనే విజయ్ సేతుపతి, పూరి జగన్నాథ్ కాంబినేషన్ కావడంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే సినిమా నిర్మాణం అనుకున్న దానికంటే ఎక్కువ సమయం తీసుకోవడంతో విడుదల ఆలస్యమవుతూ వచ్చింది. కొంతకాలం పాటు చిత్రబృందం నుంచి ఎలాంటి అప్‌డేట్స్ లేకపోవడంతో సినిమాపై చర్చ కూడా తగ్గిపోయింది. తాజాగా మేకర్స్ మళ్లీ ప్రమోషన్ మొదలుపెట్టడంతో 'స్లమ్ డాగ్' మరోసారి వార్తల్లో నిలుస్తోంది. ఈ సినిమా నుంచి తాజాగా సీనియర్ నటి టబుకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తున్న టబును 'గౌరి హెగ్డే' అనే పాత్రలో పరిచయం చేశారు. పోస్టర్‌ను పరిశీలిస్తే టబు పాత్ర సినిమాకు చాలా కీలకంగా ఉండబోతుందనే ఆసక్తి కలుగుతోంది. ఆమె పాత్ర స్వభావం, కథలో ఎలాంటి మలుపులు తీసుకురాబోతుందనే విషయాలను మాత్రం మేకర్స్ ప్రస్తుతానికి సీక్రెట్‌గా ఉంచారు. అంతేకాదు.. టబు పాత్రకు సంబంధించిన గ్లింప్స్‌ను ఆగస్టు 10న ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. దీంతో ఈ గ్లింప్స్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. విజయ్ సేతుపతి, పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రం సాలిడ్ యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది. పూరి జగన్నాథ్ సినిమాల్లో కనిపించే మాస్ ఎలిమెంట్స్‌కు విజయ్ సేతుపతి నటన తోడవడంతో ఈ ప్రాజెక్ట్‌పై మొదటి నుంచే మంచి బజ్ ఉంది. ఈ సినిమాను జేబీ మోషన్ పిక్చర్స్, ఛార్మి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో సినిమాను విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.ఇప్పటివరకు ఆలస్యం కారణంగా సైలెంట్‌గా ఉన్న 'స్లమ్ డాగ్' నుంచి వరుస అప్‌డేట్స్ రాబోతున్నట్లు తెలుస్తోంది. టబు గ్లింప్స్‌తో మొదలైన ఈ కొత్త ప్రమోషన్ క్యాంపెయిన్.. రాబోయే రోజుల్లో మరిన్ని ఆసక్తికరమైన అప్డేట్స్‌తో సినిమాపై హైప్‌ను పెంచే అవకాశం ఉంది

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,